ప్రతిపక్షం

www.prathipaksham.in

సోమవారం 19.01.2026 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 299 పేజీలు:08 వెల రూ. 5/-

పోరాడి ఓడిన భారత్.. 08

@prathipaksham | prathipaksham tv telugu

మున్సిపల్ ఎన్నికలకు కేబినెట్ ఆమోదం

116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లు, 2,996 వార్డులు, డివిజన్లలో ఎన్నికలు

- బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ సర్క్యూట్
- మెట్రో ఫేస్-2 భూసేకరణకు రూ.2,787 కోట్లు
- మేడారంలో సుదీర్ఘంగా మంత్రివర్గ సమావేశం
- వివరాలు వెల్లడించిన పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- అతిపెద్ద గిరిజన జాతర మేడారం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

(ప్రతిపక్షం స్టేట్ బ్యూరో)

మేడారం, జనవరి 18: మున్సిపల్ ఎన్నికలు వీలైనంత త్వరగా జరపాలని క్యాబినెట్ ఏకగ్రీవంగా ఆమోదించిందని పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. 2027 జులై 27 నుంచి ఆగస్టు 3 వరకు గోదావరి పుష్కరాలు రానున్నాయని, శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. మేడారంలోని హరిత హోటల్‌లో జరిగిన కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా మేడారంలో 27వ కేబినెట్ భేటీ నిర్వహించామని, మంత్రి సీతక్క చొరవతో సీఎం రేవంత్ రెడ్డి, కేబినెట్ మంత్రుల ఏకాభిప్రాయంతో అద్భుతంగా సమావేశం జరిగిందని పొంగులేటి పేర్కొన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన 14 ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యవస్థలకు భూముల కేటాయింపునకు ఆమోదం తెలిపామన్నారు. గడువు పూర్తయిన 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు, 2,996 వార్డులు, డివిజన్లలో వీలైనంత త్వరగా ఎన్నికలు జరపనున్నట్లు తెలిపారు. ఇప్పటికే డెడికేషన్ కమిషన్ నివేదిక ఇచ్చిందని, దాని ప్రకారమే రెండు రోజుల క్రితం రిజర్వేషన్లు ఖరారయ్యాయన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ సర్క్యూట్ ఏర్పాటు చేస్తామని, టెంపుల్ సర్క్యూట్ ఏర్పాటుకు ఫిబ్రవరి 15లోపు కన్సల్టెన్సీ నివేదిక ఇస్తుందని తెలిపారు. హైదరాబాద్ మెట్రోకు సంబంధించి కేబినెట్ సమావేశంలో చర్చించామన్న మంత్రి మెట్రో ఫేస్2 ఏ, బి దశలకు సంబంధించి భూసేకరణకు రూ.2,787 కోట్లు కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. మేడారంలోని హరిత హోటల్‌లో ప్రారంభమైన తెలంగాణ మంత్రివర్గ సమావేశం, సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీ సుదీర్ఘంగా కొనసాగింది. హైదరాబాద్ బయట కేబినెట్ సమావేశం జరగడం చరిత్రలో ఇది మొట్ట మొదటిసారి. మేడారం మహాజాతర సందర్భంగా సమ్మక్కసారలమ్మ సన్నిధిలో కేబినెట్ సమావేశం నిర్వహించాలని రేవంత్ రెడ్డి నిర్ణయించిన సంగతి తెలిసిందే. కేబినెట్ భేటీకి ముందు సీఎం, మంత్రులు మేడారంలోని పోలీస్ కమాండ్ కంట్రోల్‌లో సీసీ కెమెరాల పనితీరును

..:: మిగతా 2లో

తప్పుడు కథనాలతో మంత్రులను బద్నాం చేయొద్దు

- ఉపముఖ్యమంత్రి భట్టిపై వచ్చిన కథనంపై స్పందించిన సీఎం
- రెండేళ్ల పాలనలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం ఇవ్వలేదు
- మంత్రులపై వార్తలు రాసేముందు తన వివరణ తీసుకోవాలి
- అనుభవం ఉన్న కంపెనీకే సింగరేణి కోల్ మైనింగ్ టెండర్
- అయోధ్యను తలపించేలా భద్రాచలం పునర్నిర్మాణం
- ఏదులాపూర్ లో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, ఖమ్మం, జనవరి 18:

సింగరేణిలో బొగ్గు స్కామ్ అని విలేకరులు వార్తలు రాస్తున్నారని, క్యాబినెట్ మంత్రులపై వార్తలు రాసేముందు ఒకసారి తన వివరణ కూడా తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రభుత్వంపై కొంతమంది అసత్య ప్రచారం చేస్తూ, టెండర్ల గురించి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రత్యేక్షంగా, పరోక్షంగా కుంభకోణం జరిగిందని కొన్ని వార్తా పత్రికలు రాయడం పట్ల ఆక్షేపించారు. సింగరేణి బొగ్గు మాయమైందని అంటున్నారని ధ్వజమెత్తారు. ప్రజా ప్రభుత్వంలో అవకతవకలకు ఎలాంటి అవకాశం లేదని స్పష్టం చేశారు. అనవసర ప్రచారం చేస్తూ మారీచుడు, శుక్రాచార్యుడు బలపడడానికి అవకాశం కల్పిస్తున్నారని అన్నారు. ఖమ్మం జిల్లాలోని ఏదులాపూర్ మున్సిపాలిటీలో నిర్వహించిన బహిరంగసభలో పాల్గొని మాట్లాడారు. అంతకుముందు ఏదులాపురం మున్సిపాలిటీలో రూ.362 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. సింగరేణి కోల్ మైనింగ్

..:: మిగతా 2లో

నా జీవితం తెరిచిన పుస్తకం

- ప్రజల కోసం రాజకీయాల్లోకి వచ్చా
- అధికారం హోదా అనుభవించడానికి రాలేదు
- దోపిడీదారులు క్రిమినల్స్ నుంచి రాష్ట్రాన్ని ప్రజలను రక్షిస్తా
- డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క

..:: మిగతా 2లో

తొక్కిసలాట ఘటనపై సీబీఐ దర్యాప్తు..

కరూర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో టీవీకే అధినేత, నటుడు విజయ్ సీబీఐ ముందు సోమవారం మరోసారి హాజరు కానున్నారు. ఇందుకోసం ఆయన ఆదివారం సాయంత్రం ప్రత్యేక విమానంలో చెన్నై నుంచి ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

07



ధర్మంతోనే భారత్ విశ్వగురువుగా ఎదుగుతుంది

ధర్మంతోనే భారత్ విశ్వగురువు గా ఎదుగుతుందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధినేత మోహన్ భాగవత్ పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక పరిజ్ఞానం ప్రపంచానికి అవసరమని చెప్పారు.

07

ఇరాన్ మృతుల సంఖ్య 5 వేలు!

ఇరాన్‌లో ఇటీవల జరిగిన ఆందోళనల్లో వేలాది మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటివరకు ఐదు వేల మరణాలను ధ్రువీకరించినట్లు అధికార వర్గాల సమాచారం.

07

హార్వర్డ్ విద్యార్థిగా రేవంత్ రెడ్డి

- ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలో లీడర్‌షిప్‌పై కోర్స్ చేయనున్న సీఎమ్

ప్రతిపక్షం, హైదరాబాద్, జనవరి 18:

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక కొత్త రికార్డ్ సృష్టించబోతున్నారు. దేశంలో ప్రస్తుతం పదవిలో ఉన్న ముఖ్యమంత్రులందరిలో ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి ఒక కోర్స్ సర్టిఫికెట్ అందుకోబోతున్న మొదటి ముఖ్యమంత్రిగా ఒక అరుదైన ఘనత సాధించబోతున్నారు. ప్రపంచంలోని నంబర్ వన్ విద్యాసంస్థలలో ఒకటైన హార్వర్డ్ యూనివర్సిటీలోని

..:: మిగతా 2లో

రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు కొత్త ఊపిరి

- ఏపీలో పార్టీ పూర్వవైభవం దిశగా అడుగులు!
- తెలంగాణలో నిర్మలా, ఏపీలో జగ్గారెడ్డి ఫుల్ టైమ్ ఎంట్రీ!

(చిటుకుల మైసారెడ్డి)ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 18:

ఫైర్ బ్రాండ్ నేత, కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, తన వ్యక్తిగత రాజకీయ ప్రాధాన్యాలను మార్చి, ఇప్పుడు రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కి నూతన ఊపిరి ఇవ్వడానికి సిద్ధమయ్యారు. తెలంగాణఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక్కసారిగా భారీ తుఫాన్ రేగింది. సంగారెడ్డి ఓటమి తర్వాత చేసిన "ఇంకా ఎమ్మెల్యేగా పోటీ చేయను" ప్రకటన వెనుక కేవలం ఆవేశం కాదు, లోతైన వ్యూహం దాగి ఉందని రాజకీయ వర్గాలు చెబుతున్నారు. సంగారెడ్డి ఓటమి కారణంగా జగ్గారెడ్డి రాజకీయ మోడ్‌ను మార్చకపోవడం, కానీ తన భార్య నిర్మల జగ్గారెడ్డి ద్వారా తెలంగాణలో పార్టీ పట్టును కొనసాగించడం, ఆంధ్రప్రదేశ్‌లో స్వయంగా క్రియాశీలక నాయకత్వం వహించడం క్రమంగా అమలులోకి వస్తోంది. రాజకీయ విశ్లేషకుల ప్రకారం, జగ్గారెడ్డి వ్యూహం

..:: మిగతా 2లో

రైతు కూలీల చట్టాలు అమలు చేసింది కాంగ్రెస్

- కమ్యూనిస్టు మిత్రులను స్ఫూర్తిగా తీసుకుని గత అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడినం
- పాశవికంగా వ్యవహరించిన ప్రభుత్వాలను పడగొట్టామని
- ఖమ్మంలో జరిగిన సీపీఐ శతాబ్ది ముగింపు ఉత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఖమ్మం నుంచి ప్రతిపక్షం, ప్రధాన ప్రతినిధి:

రైతు కూలీల కోసం చట్టాలను అమలు చేసిన పార్టీ కాంగ్రెస్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం నాడు ఖమ్మంలో జరిగిన సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆయనతో పాటు పార్టీ జాతీయ కార్యదర్శి డి.రాజా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఈ సభలో సీఎం ప్రసంగిస్తూ..' దేశంలో మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా ఎర్రజెండా నిటారుగా నిలబడి కొట్లాడుతోంది. కామ్రేడ్ సోదరులను నేను మనసారా అభినందిస్తున్నాను. 1925 డిసెంబర్ యూపీలోని కాన్పూర్‌లో ప్రారంభించిన కమ్యూనిస్ట్ పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంది. రాబోయే వందేళ్లు కూడా పేదలు, గిరిజనుల కోసం కొట్లాడుతాం. అవసరమైతే తుదిశ్వాశ వదులుతామే తప్ప ఎర్రజెండాను మాత్రం వదలం అనడానికి ఖమ్మం శతాబ్ది ఉత్సవాలే నిదర్శనం. కమ్యూనిస్టులను ఆదర్శంగా తీసుకుని పాశవికంగా ప్రవర్తిస్తున్న కొన్ని

..:: మిగతా 2లో

కాశ్మీర్‌లో 'ఉగ్ర'వేట..

- ఏడుగురు సైనికులకు గాయాలు..
- జమ్మూ కాశ్మీర్లో ఎన్‌కౌంటర్..
- ఏడుగురు సైనికులకు గాయాలు..
- ముగ్గురు జైషే ఉగ్రవాదులు ఉన్నట్లుగా అనుమానం..

ప్రతిపక్షం, హైదరాబాద్, జనవరి 18

జమ్మూ కాశ్మీర్‌లో కిష్త్వార్ ప్రాంతంలో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఆదివారం మధ్యాహ్నం నుంచి కాల్పులు ప్రారంభయ్యాయి. సైన్యానికి చెందిన ఏడుగురు సైనికులు ఈ ఆపరేషన్‌లో గాయపడినట్లు తెలుస్తోంది. కఠినమైన పర్వత ప్రాంతాల్లో దాగి ఉన్న ఉగ్రవాదులను ఏరిపారేసేందుకు భద్రతా బలగాలు ఈ ఆపరేషన్ చేపట్టాయి. దీనికి "ఆపరేషన్ త్రాహి 1" అని పేరు పెట్టారు. భారత సైన్యానికి చెందిన వైట్ నైట్ కార్ప్స్ ఈ ఆపరేషన్ చేపట్టింది. చత్రూ ప్రాంతంలోని సొన్నార్‌లో తనిఖీలు చేపడుతున్న సమయంలో ఉగ్రవాదులకు, భద్రతా బలగాలకు మధ్య కాల్పులు జరిగాయి. పాకిస్తాన్‌కు చెందిన

..:: మిగతా 2లో

ట్రంప్ సుంకాలపై ఈయూ ఖండన

వీరిలో సుమారు ఐదు వందల మంది భద్రతా సిబ్బంది ఉన్నారని టెహ్రాన్ అధికారులు చెప్పినట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ వెల్లడించింది. తమ దేశంలో అల్లర్లకు ఇజ్రాయెల్‌తోపాటు విదేశీ శక్తులు కూడా సాయం అందించినట్లు ఇరాన్ అధికారులు ఆరోపించారు.

07

రాష్ట్రం

రైతు కూలీల చట్టాలు అమలు చేసింది కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వాలను పడగొట్టాం' అని సీఎం రేవంత్ అన్నారు.

పేదలకోసం కమ్యూనిస్టులు యుద్ధాలు..

'కమ్యూనిస్టులు పేదల కోసం ప్రభుత్వాలపైనే యుద్ధాలు చేశారు. దున్నేవానిదే భూమి అనే నినాదంతో భూస్వాముల నుంచి భూములను పేదలకు పంచడం జరిగింది. దొరల గడీల దగ్గర బానిసలుగా బతుకుతున్న కూలీల కోసం పోరాటం చేసిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ. అలానే రైతు కూలీల కోసం చట్టాలను అమలుచేసి, వారు ఉద్యమాలు చేస్తే వారికి కావాల్సిన చట్టాలను చేసింది కూడా కాంగ్రెస్ పార్టీయే. నాలుగు వేల మంది నేలకొరిగితేనే ఆ విముక్తి రైతాంగ చట్టాలకు కళ్లు తెరిపించింది. రజాకార్ల నుంచి ప్రజలకు విముక్తి కల్పించింది కమ్యూనిస్టు పార్టీనే' అని సీఎం తెలిపారు.

నాడు బ్రిటీష్‌వాళ్లు...నేడు బీజేపీ దేశానికి ప్రమాదకం....

'ఆనాడు బ్రిటిష్ వాళ్లతో ఎంత ప్రమాదమో.. ఇప్పుడు బీజేపీతోనూ అంతే ప్రమాదముంది. నాడు జాతీయ ఉపాధి హామీ చట్టానికి కాంగ్రెస్ తీసుకొస్తే ఇప్పుడు ఆ పథకాన్ని రద్దుచేసి గ్రామాల్లో వలసలకు బీజేపీ కారణమైంది. బీజేపీ అంటే బ్రిటిష్ పాలనా పార్టీ. అది విభజించి పాలిస్తుంది. పోరాటాల ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ పథకానికి మోదీ ప్రభుత్వం తూట్లు పొడిచి నిర్వీర్యం చేయాలని చూస్తోంది. అదానీ, అంబానీలకు కూలీలు దొరకటం లేదు. గత ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు అడిగింది. రాజ్యాంగాన్ని మారుస్తారని రాహుల్ గాంధీ ప్రచారం చేయడంతో 290 సీట్లకు పరిమితమైంది' అని గుర్తుచేశారు.కాంగ్రెస్... కమ్యూనిస్టులు కలిసి ఉపాధి హామీ పథకం తెస్తే బీజేపీ ప్రభుత్వం దానిని రద్దు చేసిందని సీఎం దుయ్యబట్టారు. సర్ అన్న పేరుతో పేదోళ్ల పొట్టగొట్టేందుకు నరేంద్రమోడీ ప్రయత్నిస్తున్నారన్నారు. దీన్ని ప్రజలంతా ఎదురొడ్డి అడ్డుకోవాలంటూ పిలుపునిచ్చారు. ఉపాధి హామీ రద్దుతో అగ్గువకో సగ్గువకో అదానీ అంబానీలకు కూలీలు దొరికే పరిస్థితి బ్రిటీషర్ల కు వ్యతిరేఖంగా నాడు పోరాటం చేశామన్నారు. పేదల హక్కులు కొల్లగొట్టడానికి, రాజ్యాంగం మార్చడానికి 400 సీట్లు ఇవ్వాలని బీజేపీ నాయకులు కోరారన్నారు. రాజ్యాంగాన్ని చెర పట్టడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. పేదల ఓటు హక్కు రద్దు చేసేందుకు 'సర్' తీసుకువచ్చారని ధ్వజమెత్తారు. రాజ్యాంగ సభ సమయంలోనూ గోల్వాల్కర్ వారసులు పేదలకు ఓటు హక్కు లేకుండా చేసేందుకు ప్రయత్నించారన్నారు. మూల వాసులు ఎక్కడ నుంచి ఆధారాలు తెస్తారు ఓటు హక్కు లేకపోతే రేషన్ కార్డు, ఇల్లు, పింఛన్ పోతుందని సీఎం తెలిపారు. కాంగ్రెస్, కమ్యూనిస్ట్ తేడా లేకుండా మోదీకి వ్యతిరేకంగా దండు కట్టాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టులు పేదల కోసం కొట్లాడతారు నేటి ఈ ప్రభుత్వంలో మీ శ్రమ ఉంది. నరేంద్ర మోదీ, అమిత్ షా కలిసి వచ్చినా బీజేపీ ఒక్క సీటు లేదన్నారు. తులసీ వనంలో గంజాయి మొక్కకు చోటు లేదుని ఖమ్మం జిల్లాలో బీజేపీకి చోటు ఇవ్వలేదన్నారు. ఖమ్మం జిల్లాలో బీజేపీకి సర్పంచులు కూడా లేరని సీఎం తెలిపారు.

'నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారానే ప్రత్యేక రాష్ట్రం వచ్చింది. నిజాం రజాకార్లను తరిమిన చరిత్ర ఈ ప్రాంతానికి ఉంది. పుచ్చలపల్లి సుందరయ్య, చండ్రా రాజేశ్వరరావు, నల్లమల్ల గిరిప్రసాద్ పోరాటం చేశారు. పేదల వ్యతిరేక పార్టీ బీజేపీ. ఓటు తొలగిస్తే సంక్షేమ పథకాలు పోతాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కాంగ్రెస్, కమ్యూనిస్టు ఏకమవ్వాలి. ఎర్రజెండా సోదరులు పిలవగానే వచ్చాను. మీరు పోరాడే వాటికి చట్టం చేస్తాం. ఇక్కడ నరేంద్ర మోదీ, అమిత్ షా ఇద్దరూ కలిసివచ్చిన రెండు సర్పంచ్ స్థానాలను గెలిపించలేరు.' అంటూ సీఎం ఫైర్ అయ్యారు

పేదల హక్కుల పోరాటాల్లో ప్రాణాలు కోల్పోతామే కానీ ఎర్ర జెండా వదలమని ప్రకటించిన కామ్రేడ్లకు వందనం అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రైతులు, రైతు కూలీలు, హరిజనులు, గిరిజనులు కోసం కమ్యూనిస్టులు పోరాడారని కితాబిచ్చారు. దున్నే వాడిదే భూమి అని కమ్యూనిస్టులు పిలుపునిస్తే దానిని అమల్లోకి తెచ్చింది ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు, బూర్గుల రామకృష్ణారావు అని తెలిపారు. రైతులు ధర నిర్ణయించలేనప్పుడు కనీస మద్దతు ధర కోసం కమ్యూనిస్టులు పోరాడారని గుర్తుచేశారు. 4 వేల అమర వీరుల త్యాగాలతో హైదరాబాద్ రాష్ట్రం నిజాం నుంచి విముక్తి అయిందని తెలిపారు. పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు, నల్లమల గిరిప్రసాద్, శేషగిరి రావు వంటి వారెందరో నాడు పోరాడారన్నారు.

హార్వర్డ్ విద్యార్థిగా రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

కెనడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో "లీడర్‌షిప్: 21 సెంచరీ" అనే కోర్స్‌కు హాజరుకాబోతున్నారు. దీనితో, భారతదేశ చరిత్రలో ఒక ఐవీ లీగ్ కార్యక్రమానికి హాజరవుతున్న మొదటి ముఖ్యమంత్రి రేవంతే అవుతారు. "21వ శతాబ్దంకోసం నాయకత్వం(అస్తవ్యస్తత, సంఘర్షణ, ధైర్యం)" కోర్స్ కోసం ఆయన ఈ నెల 25 నుంచి 30 వరకు మసాచుసెట్స్‌లోని కెనడీ స్కూల్ క్యాంపస్‌లో ఉండి తరగతులకు హాజరవుతారు. ఐదు ఖండాలనుంచి 20 దేశాల ప్రతినిధులు ఈ కోర్సుకు హాజరు కాబోతున్నారు. వీరితో కలిసి రేవంత్ రెడ్డి తరగతులు, అసైన్‌మెంట్‌లు, హోమ్‌వర్క్‌లు పూర్తి చేసి గ్రూప్ ప్రాజెక్టులు కూడా నిర్వహిస్తారు. ఈ కోర్సుకు ప్రొఫెసర్ టిమ్ ఓ బ్రియాన్ ఛైర్మన్‌గా, ప్రొఫెసర్ కరెన్ మోరిసీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ కోర్సులో భాగంగా ప్రతినిధి బృందాలు ప్రపంచంలోని వివిధ ప్రాంతాలు, కాలాలు, తరాలనుండి కేస్ స్టడీలను విశ్లేషించి, పరిష్కారాలు రూపొందించి తరగతిలో సమర్పిస్తారు. కోర్స్ పూర్తి చేసిన తర్వాత ముఖ్యమంత్రి హార్వర్డ్ యూనివర్సిటీనుంచి సర్టిఫికెట్ పొందనున్నారు.

నా జీవితం తెరిచిన పుస్తకం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్:

వ్యాపార సామ్రాజ్యాలను విస్తరించడము కోసమో, అధికారం హోదాను అనుభవించడం కోసం తాను రాజకీయాల్లోకి రాలేదని, నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం హైదరాబాదులోని ప్రజా భవన్ లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక లక్ష్యం కోసం రాజకీయాల్లోకి వచ్చానని, దారి దోపిడీదారులు, బందిపోట్ల నుంచి తెలంగాణ ఆస్తులను వనరులను రక్షించి, వాటిని ప్రజలకు అందజేయడం కోసమే రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. సింగరేణి బొగ్గు సంస్థలకు టెండర్లపై ఓ పత్రికలో కొత్త పలుకులో తనకు తోసింది రాశాడని విమర్శించారు. ఓ కట్టు కథనాన్ని ఎవరి ప్రయోజనం కోసమో వండి వార్చా డన్నారు . టెండర్ల నిబంధనలు సింగరేణి బోర్డ్ ఖరారు చేస్తుంది మంత్రికి సంబంధం ఉండదని తెలిపారు. ఆరోపణలు వచ్చిన వెంటనే టెండర్లు రద్దు చేయాలని సూచించినట్టు తెలిపారు.తాను సింగరేణి బోర్డు సభ్యులకు చెప్పి వెంటనే సదరు బోర్డు మాత్రం టెండర్లు పిలిచిన ఇంకా ఎవరూ రాలేదని చెప్పారని అన్నారు. అయినప్పటికీ తాను టెండర్లు రద్దు చేసి ఫ్రెష్‌గా పిలవమని సూచించినట్టు తెలిపారు. తాను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తో సన్నిహితంగా ఉండటంతో రాధాకృష్ణకు నచ్చక వైయస్ పై ఉన్న కోపంతో నాపై ఈ వార్త రాసినట్టుగా కనిపిస్తుందని పేర్కొన్నారు. ఈ వార్త వల్ల అధికారులకు, మంత్రులకు, ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోనని స్పష్టం చేశారు. తాను ఆత్మగౌరవం కోసం బతుకుతామని, దోపిడి దారుల నుంచి రాష్ట్రాన్ని కాపాడటానికి రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు మంత్రులమంతా రాష్ట్ర ప్రజల విస్తృత ప్రయోజనాల కోసం పనిచేస్తున్నామని చిల్లర కథనాలతో భయపెట్టాలని చూస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. తాను రాజకీయాల్లోకి గాలికి రాలేదని 40 సంవత్సరాలుగా సభలో ,బయట ఉండి ప్రజల కోసం పోరాటాలు చేసి వచ్చానన్నారు. రాధాకృష్ణ తొలి పలుకును ఏం ఆశించి రాశాడో,ఎవరి మెప్పు కోసం రాశాడో బయటపడుతుందని అన్నారు. ఈ కథనంపై రాష్ట్ర ప్రజలకు నిజాలు తెలియాలని తాను స్పందించడం జరిగిందన్నారు. త్వరలో పూర్తి వివరాలతో అన్ని విషయాలు వివరిస్తానని తెలిపారు.

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా రెపరెపలాడాలి

సర్పంచ్ ఎన్నికల్లో 85% కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించుకొని రాష్ట్రానికి ఖమ్మం జిల్లా తలమానికంగా నిలిచింది రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులను కలిసి జిల్లాలో సాగునీటి పారుదల, విద్య, ఆరోగ్యానికి సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో అన్ని చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగానే జేఎన్టీయూ విశ్వవిద్యాలయం బ్రాంచ్, నర్సింగ్ కళాశాల, సాగునీటిపారుదలలో భాగంగా మున్నేరును పాలేరుకు లింక్ చేయడం వంటి పనులు చేపట్టినట్టు తెలిపారు. ఖమ్మం జిల్లాలో చదువుకున్న నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

మున్సిపల్ ఎన్నికలకు కేబినెట్ ఆమోదం

మొదటిపేజీ తరువాయి

పరిశీలించారు. మహాజాతర భద్రతా ఏర్పాట్ల గురించి పోలీసులను వివరాలు తెలుసుకున్నారు. సీసీ కెమెరాలు, ఏఐ టెక్నాలజీని వినిగించడం వాటి పనితీరును ఉన్నతాధికారులు సీఎంకి వివరించారు. మేడారంలో హరిత హోటల్ లో సుమారు 2 గంటలపాటు సుదీర్ఘంగా మంత్రివర్గ సమావేశం జరిగింది. ఇందులో భాగంగా పలు అంశాలపై కీలక అంశాలకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ, ములుగు జిల్లాలో సాగునీరు అందించేందుకు పొట్లపూర్ ఎత్తిపోతల పథకం, గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అనంతరం సీఎం, మంత్రులు మేడారం ఆలయ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్నారు.

అతిపెద్ద గిరిజన జాతర మేడారం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కేబినెట్ సమావేశాన్ని ఇప్పటి వరకు హైదరాబాద్ దాటి ఎక్కడా ఏర్పాటు చేయలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తొలిసారి హైదరాబాద్‌ను దాటి మేడారంలో కేబినెట్ సమావేశం ఏర్పాటు చేశామని చెప్పారు. అతిపెద్ద గిరిజన జాతర, మేడారం జాతర అని కొనియాడారు. జనాల కోసం కాకతీయులపై కత్తిదూసిన ధీరవనితలు సమ్మక, సారక్కలని పేర్కొన్నారు. తాను టీపీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు హాత్ సే హాత్ జోడో యాత్రను ఇక్కడి నుంచే ప్రారంభించినట్లు గుర్తుకుచేశారు. సమ్మక్కసారక్కల ఆశీర్వాదంతోనే హాత్ సే హాత్ జోడో యాత్ర విజయవంతమైందన్నారు. ఇద్దరు ఆడబిడ్డల నేతృత్వంలో సమ్మక్కసారక్క జాతర ఏర్పాట్లు వైభవంగా జరుగుతున్నాయని, ఉత్తరాదిలో కుంభమేళా తరహాలో దక్షిణాదిలో సమ్మక్కసారక్క జాతర జరుపుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మేడారం పనులు చేసినందుకు తన జన్మ ధన్యమైందని పేర్కొన్నారు. ఎవరేమనుకున్నా తకు సంబంధం లేదని మంచి పని చేసేటప్పుడు అంటూనే ఉంటారని అన్నారు.

తప్పుడు కథనాలతో మంత్రులను బద్నాం చేయొద్దు

మొదటిపేజీ తరువాయి

టెండర్‌ను అనుభవం ఉన్న కంపెనీకే కేటాయిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సింగరేణి టెండర్ విషయంలో అణాపైసా అవినీతికి కూడా ఆస్కారం లేదని తేల్చి చెప్పారు. ప్రభుత్వాన్ని ఎలాగైనా బద్నాం చేయాలని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. సోషల్ మీడియా ద్వారా అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.మంత్రులపై తప్పుడు వార్తలు వస్తే నా మీద వచ్చినట్లే

తప్పుడు ప్రచారాల ద్వారా బీఆర్ఎస్ నేతలు బలపడేలా చేయొద్దని సీఎం రేవంత్ మీడియా యాజమాన్యాలకు సూచించారు. మీడియా వారి మధ్య గొడవలుంటే తలుపులు మూసుకొని కొట్టుకోవాలని అన్నారు. మీరు కొట్టుకుంటే కొట్టుకోండి తప్ప మా మంత్రులను బద్నాం చేయొద్దని కోరారు. మీడియాకు వివరణ ఇచ్చేందుకు తాను ఎప్పుడైనా సిద్ధంగా ఉంటానని తెలిపారు. తమ మంత్రులపై తప్పుడు వార్తలు వస్తే తన గౌరవానికి భంగం కలిగినట్లేనని చెప్పారు. మంత్రులందరూ సమన్వయంతో పని చేస్తున్నట్లు తెలిపారు. భద్రాచలానికి రూ.100 కోట్లు ఇస్తానని చెప్పి మాజీ సీఎం కేసీఆర్ ఏమీ ఇవ్వలేదు సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. తమ ప్రభుత్వంలో భద్రాచలంలో భూసేకరణ జరుగుతోందని తెలిపారు. భద్రాచలాన్ని అయోధ్యను తలపించేలా అద్భుతంగా పునఃర్మిస్తామన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బొందపెట్టాలి...

త్వరలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి బీఆర్ఎస్‌ను బొందపెట్టాలని అన్నారు. 2023 నుంచి 2034 వరకు అధికారం కాంగ్రెస్‌దేనని జోస్యం చెప్పారు. పదేళ్లు ఇందిరమ్మ రాజ్యం, పేదల ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని అన్నారు. ఖమ్మం జిల్లాలో బీజేపీ ఆనవాళ్లు లేవని, బీజేపీని ఖమ్మంలోకి రాలేదని, ఆ జిల్లా ప్రజలు మొదటి నుంచి బీజేపీని నిషేధించారని సీఎం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎవరికైనా డబల్ బెడ్‌రూమ్ ఇల్లు వచ్చిందా? అని సీఎం ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చాక 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చినట్లు తెలిపారు. పేదలకు ఇల్లు ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం చూసుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పేదవాడిపై కుట్ర చేసి ఇళ్లు ఇవ్వకుండా అడ్డుకుందని నిప్పులు చెరిగారు. గత ప్రభుత్వం వారి మోచేతి నీళ్లు తాగాలి అన్నట్లుగా వ్యవహరించిందని ఘటుగా వ్యాఖ్యానించారు. తన రాజకీయ ప్రయాణం మొదట ఖమ్మం జిల్లాలోనే మొదలు పెట్టినట్లు సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. 200708లో ఖమ్మం జిల్లా మధిరలోని కొన్ని గ్రామాల్లో టీడీపీ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేవరకు ఖమ్మం జిల్లా ప్రజలు తనకు అండగా నిలబడ్డారని అన్నారు. గత ప్రభుత్వంలో రేషన్ కార్డు రావాలంటే ఉన్నవాళ్లలో ఎవరో చనిపోవాలనే పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు లక్షలాది రేషన్ కార్డులను పేదలకు అందించినట్లు తెలిపారు. ఇంకా రాష్ట్రంలో ఎవరికైనా రేషన్ కార్డు రాకపోతే జారీ చేస్తామన్నారు. సన్న బియ్యం అందించి పేదవాడి ఆకలి తీర్చాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ఎన్టీఆర్ స్ఫూర్తితోనే పేదలకు సన్న బియ్యం

నేడు నందమూరి తారక రామారావు వర్ధంతి అని ఆయన ఆశయాలను సాధించడమే ఘన నివాళి అని సీఎం చెప్పారు. మదరాసీలుగా ఉన్న తెలుగువారికి ఎన్టీఆర్ ప్రత్యేక గుర్తింపు తెచ్చారని, రూ.2 బియ్యంతో పేదోడికి తెల్లన్నం తినే అవకాశం కల్పించారని గుర్తుకుచేసుకున్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో తాము పేదోడికి సన్నబియ్యం ఇస్తున్నామన్నారు. తెలంగాణలో ఎన్టీఆర్ అభిమానులు, చంద్రబాబు సహచరులు ఉన్నారని తెలిపారు.

తెలంగాణలో టీడీపీ ఉండొద్దని కేసీఆర్ కక్షకట్టి ఆ పార్టీ నాయకత్వాన్ని దెబ్బతీశారని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌ను 100 మీటర్ల గొయ్యితీసి పాతిపెట్టడమే ఎన్టీఆర్‌కు నివాళి అని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ నేతలు గద్దెలు దిగాలి, ఊళ్లలో బీఆర్ఎస్ గద్దెలు కూలాలని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీని భూస్థాపితం చేయడమే ఎన్టీఆర్‌కు మనం ఇచ్చే ఘన నివాళి అని పేర్కొన్నారు. రైతులకు 9 గంటల కరెంట్ ఇచ్చిన ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఇచ్చారన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో నిరంతరంగా విద్యుత్ ను సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న బీఆర్ఎస్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వకుండా బీఆర్ఎస్ హయాంలో పేదలను ఇబ్బంది పెట్టారని ధ్వజమెత్తారు. పేదలను ఇబ్బందులకు గురిచేసిన బీఆర్ఎస్ దిమ్మలు కూలగొట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ శ్రేణులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. నేడు నందమూరి తారక రామారావు వర్ధంతిని స్మరించుకుంటూ.. అందరూ తెలుగు వాళ్లను 'మదరాసీ'లని అంటుంటే ఆత్మగౌరవంతో నిలబెట్టిన మహనీయుడు ఎన్టీఆర్ అని కీర్తించారు సీఎం రేవంత్. ఖమ్మం జిల్లాలో ఎన్టీఆర్, చంద్రబాబు అభిమానులు ఎక్కువగా ఉన్నారని ప్రస్తావించారు. పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు ఎన్టీఆర్ అని ప్రశంసించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితోనే పేదలకు సన్నబియ్యం పథకం అమలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. పేదలకు సంక్షేమం అందించడమే ఎన్టీఆర్‌కు మనమిచ్చే ఘన నివాళి అని తెలిపారు. 2007 సంవత్సరంలో మొదటిసారిగా తాను మధిర నియోజకవర్గంలో నిర్వహించిన టీడీపీ కార్యక్రమంలో పాల్గొన్నానని ప్రస్తావించారు రేవంత్. అప్పుడే స్నానాల లక్ష్మీపురం వెళ్లి మల్లు భట్టివిక్రమార్కను స్వగ్రామంలో చూశానని గుర్తుచేశారు. ఈ ఇరవై సంవత్సరాల్లో తానెప్పుడు వచ్చినా ప్రజలు ప్రేమాభిమానాలు పంచారని చెప్పుకొచ్చారు. తాను ముఖ్యమంత్రి స్థాయికి ఎదగటానికి ప్రజలు ఇచ్చిన సహకారం మరవలేనిదని సీఎం రేవంత్ పేర్కొన్నారు.



కాశ్మీర్‌లో 'ఉగ్ర'వేట..

మొదటిపేజీ తరువాయి

జైషే మహ్మద్ ఉగ్రవాదులు ఇద్దరు, ముగ్గురు ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. భద్రతా బలగాల వలయాన్ని ఛేదించేందుకు ఉగ్రవాదులు గ్రెనేడ్లు విసిరినట్లు చెప్పారు. దీనికి ప్రతిగా సైన్యం దాడుల్ని పెంచిందని, గాయపడిన సైనికుల్ని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు చెప్పారు. భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూ కాశ్మీర్ పోలీసుల్ని మోహరించారు. డ్రోన్లు, స్నిఫర్ డాగ్స్‌ను ఉపయోగించి ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. ఇది ఈ ఏడాది మూడో ఎన్‌కౌంటర్. జనవరి 7, 13 తేదీల్లో కథువా జిల్లాలో కహోగ్, నజోటే అటవీ ప్రాంతాల్లో ఎదురుకాల్పులు జరిగాయి. రిపబ్లిక్ డే సమీపిస్తున్న తరుణంలో పాకిస్తాన్ ఉగ్రవాదుల్ని దేశంలోకి పంపే ప్రయత్నాలు చేస్తున్నట్లు నిఘా సమాచారం ఉంది. దీంతో భద్రతా బలగాలు కౌంటర్ టెర్రర్ ఆపరేషన్లను పెంచింది.

రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు కొత్త ఊపిరి

మొదటిపేజీ తరువాయి

ఒక వైపు కుటుంబ రాజకీయ సమీకరణను ఉపయోగిస్తూ తెలంగాణలో స్థిరీకరణ సాధించడమే కాకుండా, ఆంధ్రప్రదేశ్‌లో ఫుల్ టైమ్ ఫైర్ బ్రాండ్ ఎంట్రీ ద్వారా పార్టీని శూన్యం నుండి పునరుద్ధరించే లక్ష్యంతో ముందుకు వెళ్తుంది. తన తల్లిగారి స్వస్థలం కృష్ణా జిల్లా మైలవరం, కుటుంబం అనుబంధాలు, మంగళగిరికి తన కూతురును ఇచ్చిన అంశాలు, స్థానిక రాజకీయ ప్రాధాన్యత కేంద్రాలు ఈ వ్యూహానికి బలం కల్పిస్తున్నాయి. జగ్గారెడ్డి వ్యక్తిగత శైలి, ప్రజల మధ్య నేరుగా కమ్యూనికేట్ చేసే సామర్థ్యం, దూకుడైన విమర్శల సామర్థ్యం ఆయనను ఏపీ రాజకీయాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. "సంగారెడ్డి కాదు, కానీ రాజకీయ రంగం వదలను అన్న వ్యాఖ్యలు స్పష్టంగా సూచిస్తున్నాయి. రెండు రాష్ట్రాల వ్యూహంలో మరో కీలక దశకు చేరుకున్నాయి. జగ్గారెడ్డి త్వరలో విశాఖ ఉక్కు పరిశ్రమను సందర్శించి, ప్రజలతో నేరుగా సమావేశమవుతారని తెలుస్తుంది. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ పూర్వవైభవాన్ని తిరిగి తీసుకురావడానికి, స్థానిక నేతలతో భేటీలు, కొత్త నాయకత్వ నియామకాలు, రైతు, యువత, వాణిజ్య వర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. మొత్తం రాజకీయ వర్గాలు, విశ్లేషకులు ఇప్పుడు వేచిచూస్తున్నది. రెండు రాష్ట్రాల్లో ఈ ఫైర్ బ్రాండ్ వ్యూహం ఫలితాలను తీసుకువస్తుందా, లేక మరో రాజకీయ తుఫాన్ రానుందా? కానీ ఒక విషయం ఖాయం. జగ్గారెడ్డి పేరు ఇక తెలంగాణకే పరిమితం కాదు, ఏపీ రాజకీయాల్లో కూడా హాట్ టాపిక్ అయ్యింది.



సమ్మక్క సారలమ్మ జాతర ప్రాశస్త్యం

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 18

తెలంగాణ రాష్ట్రంలో ములుగు జిల్లాలో జరిగే అతిపెద్ద, విశిష్ట ఆదివాసిల జాతర మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రతి రెండు సంవత్సరాల కొకసారి జరుగుతుంది. ఈ సంవత్సరం జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రం నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్ గఢ్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల నుంచి సుమారు కోటిన్నరకు పైగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఇది ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా పేరొందింది. అందుబాటులో ఉన్న సమాచారం అనుసరించి, ఈ జాతర యొక్క ప్రాశస్త్య మేమనగా 12వ శతాబ్దంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జగిత్యాల ప్రాతంలోని పొలవాసను పాలించే ఆదివాసి దొర మేడరాజు ఏకైక కుమార్తె సమ్మక్కను ఆయన మేనల్లుడైన మేడారం పాలకుడు పగిడిద్దరాజు కిచ్చి వివాహం చేశారు. ఈ దంపతులకు సారలమ్మ, జంపన్న ఇద్దరు సంతానం. కాకతీయులకు ప్రతీ సంవత్సరం చెల్లించే కప్పం కట్టలేదన్న కారణంతో కాకతీయ ప్రభువు మొదటి ప్రతాపరుద్రుడు పొలవాసపై దండెత్తుతాడు. ఆయన దాడికి తట్టుకోలేక మేడరాజు మేడారం పోయి అజ్ఞాత వాసం గడుపుతుంటాడు. మేడారాన్ని పాలించే పగిడిద్దరాజు కాకతీయుల సామంతునిగా వుంటూ కరువు కాటకాల కారణంగా కప్పం కట్టలేక పోతాడు. కప్పం కట్టకపోవడం, మేడరాజుకు ఆశ్రయం కల్పించడం, కోయ ఆదివాసిల సార్వభౌమునికి వ్యతిరేకంగా తిరుగుబాటు భావాజాలాన్నినూరిపోసి రాజ్యాధికారాన్ని ధిక్కరిస్తున్నాడనే కారణాలతో పగిడిద్దరాజుపై ఆగ్రహం చెందిన ప్రతాపరుద్రుడు అతడిని అణచివేయడానికి తన ప్రధానమంత్రి యుగంధరుడితో మాఘ శుద్ధ పౌర్ణమి రోజున మేడారంపై దండెత్తుతాడు.

సాంప్రదాయ ఆయుధాలు ధరించి పోరాడిన పగిడిద్దరాజు, నమ్మక్క, సారక్క, జంపన్న, గోవిందరాజులు విరోచితంగా పోరాటం చేసినప్పటికీ సుశిక్షుతులైన అపార కాకతీయ సేనల ధాటికి తట్టుకోలేక పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, గోవిందరాజులు యుద్ధంలో మరణిస్తారు. పరాజయ వార్త విన్న జంపన్న అవమానాన్ని తట్టుకోలేక సంపెంగ వాగులో దూకి ఆత్యహత్యకు పాల్పడతాడు. అప్పటి నుంచి సంపెంగవాగు జంపన్న వాగుగా ప్రసిద్ధి చెందింది.ఇక సమ్మక్క యుద్ధ భూమిలో కాకలు తీరిన కాకతీయుల సైన్యాన్ని ముప్ప తిప్పలు పెడుతుంది. ఆదివాసి మహిళ యుద్ధ నైపుణ్యానికి ప్రతాపరుద్రుడు ఆశ్చర్యచకితుడు అవుతాడు. చివరికి సమ్మక్కను కాకతీయుల సైన్యం వెనుక వైపు నుండి బరిసెతో పొడుస్తారు. శత్రువుల చేతిలో దెబ్బతిన్న సమ్మక్క రక్తపు ధారలతోనే యుద్ధ భూమి నుంచి నిష్క్రమించి చిలుకల గుట్టవైపు వెళుతూ మార్గమధ్యములోనే అదృశ్యమవుతుంది. సమ్మక్కను వెతుక్కుంటూ వెళ్ళిన అనుచరులకు ఆమె జాడ కనిపించలేదు. కానీ ఆ ప్రాంతంలో ఒక పుట్ట దగ్గర పసుపు, కుంకుమలు గల కుంకుమ భరణ లభిస్తుంది. దాన్ని సమ్మక్కగా భావించి అప్పటి నుంచి ప్రతి రెండేళ్లకు ఒకసారి మాఘ శుద్ధ పౌర్ణమి రోజున సమ్మక్క సారలమ్మ జాతరను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.ఈసారి 2026 లో జనవరి 28 నుండి 31 వ తేదీ వరకు మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర జరుగుతుంది. జాతర మొదటి రోజైన 2801 2026 నాడు కన్నేపల్లి నుంచి సారలమ్మను గద్దెకు తీసుకు వస్తారు. అదే రోజు కొండాయి నుండి గోవిందరాజులును, పూనుగుండ్ల నుండి పడిగిద్దరాజులను గద్దెలపై ప్రతిష్టింప చేస్తారు. రెండవ రోజున 29012026 సమ్మక్కను చిలుకల గుట్ట నుండి పూజార్లు తీసుకోని వచ్చి గద్దెపై ప్రతిష్టింప చేస్తారు. మూడో రోజున శుక్రవారం పూర్తి మొక్కుల చెల్లింపు, నాలుగవ రోజు సాయంత్రం దేవ దేవతలను తిరిగి వన ప్రవేశం చేస్తారు. వంశపారంపర్యంగా వస్తున్న ఆదివాసులే పూజార్లు కావడం ఈ జాతర పూర్తిగా ఆదివాసీ సాంప్రదాయాల ప్రకారం నిర్వహించడం ప్రత్యేకత. తమ కోర్కెలు తీర్చమని భక్తులు అమ్మవార్లకు బంగారం (బెల్లము) నైవేద్యంగా సమర్పించుకుంటారు.

జన సముద్రమైన ఏడుపాయల

- మాఘ అమావాస్య సందర్భంగా మంజీరనదిలో పుణ్య స్థానాలు

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 18:-

తెలంగాణలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గ మాత ఆలయం మాఘ అమావాస్య సందర్భంగా భక్తులు పోటెత్తింరు. హైదరాబాద్ కర్ణాటక మహారాష్ట్ర రాష్ట్రాల నుండి వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేశారు సింగూరు డ్యామ్ నుండి వీటిని వదలడంతో భక్తులు మంజీర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, అమ్మవారిని దర్శించుకున్నారు. రద్దీ ఎక్కువగా ఉండటంతో దర్శనానికి గంటకు పైగా సమయం పడుతుంది.ఆలయ ఈవో చంద్రశేఖర్ నేతృత్వంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వనదుర్గ నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా జిల్లా అధికారులు అదనపు కలెక్టర్ నగేష్ మెదక్ ఆర్డీఓ రమాదేవి పోలీస్ అధికారులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న అడిషనల్ ఎస్పీ మహేందర్

ఈ రోజు మాఘ అమావాస్య సందర్భంగా ఏడుపాయలలో వన దుర్గ మాతరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ బందోబస్తు ఏర్పాట్లను మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, భద్రతా చర్యలు, మహిళా భక్తుల రక్షణ తదితర అంశాలపై అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జాతరను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

ఏకగ్రీవ వార్డులకు రూ.50 లక్షల నజరాన

- ప్రజా సేవకులకే కౌన్సిలర్ టికెట్టు
- బాన్సువాడను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా : పోచారం

ప్రతిపక్షం, బాన్సువాడ :

బాన్స్వాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే, వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఒకటవ వార్డులో ప్రజలతో ముఖాముఖి అయ్యారు. వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఏ ఆర్ గార్డెన్ లో జరిగిన సభలో మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రజల కోసం కష్టపడాలని కష్టపడే వ్యక్తులకే టికెట్ ఇస్తామని స్పష్టం చేశారు. కొందరు కౌన్సిలర్లు ఉదయం 11 గంటల వరకు నిద్ర లేవకుండా ప్రజల సమస్యలను తెలుసుకోకుండా వ్యవహరించారని, ఈసారి ఎన్నికల్లో మాత్రం అభ్యర్థులను ఆచితూచి ఎంపిక చేస్తామన్నారు. ప్రజల కోసం వారి సమస్యల పరిష్కారం కోసం ఎల్లవేళలా అందుబాటులో ఉండి కష్టపడే వ్యక్తులను ఎంపిక చేసి గెలిపించుకుంటామని పేర్కొన్నారు. కౌన్సిలర్ తన వార్డులోని తాగునీటి సమస్య, పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీలు, సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలని అన్నారు. వీటి కోసం నిధులు ఎన్ని అవసరమైనా తాను ఇప్పించడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఒకటవ వార్డులో ఉన్న సమస్యలను పరిష్కరించి అమెరికాలోని చికాగో వీధుల వలె తీర్చిదిద్దుతానని అన్నారు. ఈ వార్డులో ప్రజలందరూ ఏకమై కౌన్సిలర్ అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఏకగ్రీవ ఎన్నిక అయితే తాను ప్రభుత్వమిచ్చే నిధులతో పాటు ప్రత్యేకంగా రూ. 50 లక్షలు ప్రోత్సాహక బహుమతిగా ఇస్తానని అన్నారు. అలాగే మిగతా వార్డుల్లో కూడా ఏకగ్రీవంగా ఎన్నికొంటె ఇదేవిధంగా ప్రోత్సాహక నిధులు ఇస్తానని పోచారం స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిని కూడా కష్టపడే వారికి ఎంపిక చేస్తామని అన్నారు. టీఎస్ ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పోచారం సహకారంతో బాన్సువాడలో సమస్యలు లేకుండా చేస్తామన్నారు. ఏకగ్రీవ వార్డులకు తన తరపున రూ. లక్ష అందిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, మహమ్మద్ ఇజాస్, గురువిన కుమార్, జంగం గంగాధర్, పిట్ల శ్రీధర్, అలిబిన్ అబ్దుల్లా, గోపాల్ రెడ్డి, వహాబ్, కయుమ్ నిషాద్, కాలిక్, నార్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

- ప్రతిభ చూపిన జిల్లా క్రీడాకారులు

ప్రతిపక్షం, చిట్యాల, జనవరి 18:

నేషనల్ షూటింగ్ బాల్ పోటీలకు నల్గొండ జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. తెలంగాణ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా తాండూరులో ఆదివారం నిర్వహించిన ఐదవ జాతీయస్థాయి సౌత్ జోన్ షూటింగ్ బాల్ సెలక్షన్స్ లో నల్గొండ జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు జాతీయస్థాయికి ఎంపికయ్యారు. సీనియర్ విభాగంలో చిట్యాల మండలం, ఉరుమడ్ల గ్రామానికి చెందిన గంగాపురం రాము, చిట్యాల పట్టణానికి చెందిన వెలుగు చంద్రశేఖర్, జూనియర్ విభాగంలో నార్కట్ పల్లి కి చెందిన ఎస్కే నాగూర్ వలీ, సబ్ జూనియర్ విభాగంలో చిట్యాల కు చెందిన గాధగోని నాగరాజులు ఎంపికయ్యారు. వీరు తిరుపతిలో ఫిబ్రవరి 7 నుండి 9 వరకు జరిగే జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొంటారు.

కామారెడ్డి అభివృద్ధికి నా తుదిశ్వాస వరకు పాటుపడతా

- షబ్బీర్ అలీ
- ఎమ్మెల్యే ధ్యాస ప్రోటోకాల్‌పైనే.. నా ధ్యాస అభివృద్ధిపైనే!

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 18:

కామారెడ్డి అభివృద్ధికి నా తుదిశ్వాస వరకు పాటుపడతానని, కామారెడ్డి ప్రజల దాహార్తిని తీర్చడం కోసం గతంలోనే 120 కిలోమీటర్ల దూరం నుండి గోదావరి జలాలను తీసుకువచ్చానని, కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ వ్యవస్థను నిర్వీర్యం చేసి మళ్లీ కామారెడ్డికి నీటి కష్టాలు తెచ్చిందని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ విమర్శించారు. ఆదివారం కామారెడ్డి పట్టణంలోని 15వ వార్డులో రూ. 1.35 కోట్లతో సీసీ రోడ్లు, పార్కు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో షబ్బీర్ అలీ మాట్లాడుతూ కామారెడ్డికి 25 ఏళ్ల వరకు నీటి కష్టాలు రాకుండా నేను ఎంతో కష్టపడి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమృత్ పథకం కింద రూ. 200 కోట్లు మంజూరు చేయించామని, దీనివల్ల రాబోయే 25 ఏళ్ల వరకు కామారెడ్డి పట్టణానికి తాగునీటి ఇబ్బందులు ఉండవని షబ్బీర్ అలీ స్పష్టం చేశారు. తాను ఎప్పుడూ పేరు కోసం పనిచేయలేదని, ప్రజల కష్టాలు తీర్చడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

ప్రోటోకాల్ రాజకీయాలపై విమర్శలు

స్థానిక ఎమ్మెల్యే రమణారెడ్డిపై షబ్బీర్ అలీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.గడిచిన రెండేళ్లుగా ఎమ్మెల్యే సహకారం కోసం వేచి చూశాను. కానీ ఆయనకు అభివృద్ధి కంటే ప్రోటోకాల్ పైనే ఎక్కువ ధ్యాస ఉంది.అభివృద్ధి జరుగుతున్న చోట 14 గ్రామాలపై విజిలెన్స్ విచారణకు ఫిర్యాదు చేయడం ఆయన వైఖరికి నిదర్శనం" అని మండిపడ్డారు. అధికారులు శంకుస్థాపనల కోసం సమయం అడిగితే మహారాష్ట్ర, ఢిల్లీలో ఉన్నానని చెబుతూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు.

కొడంగల్‌తో సమానంగా నిధులు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి, ఆయన నియోజకవర్గం కొడంగల్‌కు ఇచ్చే నిధుల్లో సగం అయినా కామారెడ్డికి ఇవ్వాలని కోరానని, దానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి కొడంగల్‌తో సమానంగా నిధులు ఇస్తామని హామీ ఇచ్చారని షబ్బీర్ అలీ వెల్లడించారు.

ప్రస్తుత అభివృద్ధి పనుల వివరాలు:

ఇందిరా గాంధీ స్టేడియం: రూ. 9 కోట్లతో ఆధునీకరణ.

వార్డుల అభివృద్ధి: పట్టణంలోని ప్రతి వార్డుకు రూ. 50 లక్షల చొప్పున మొత్తం రూ. 26 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పార్కుల నిర్మాణం.

15వ వార్డు: రూ. 1.35 కోట్లతో ప్రత్యేక అభివృద్ధి పనులు. ఈరోజు ప్రారంభం ఇచ్చామని అన్నారు

అభివృద్ధి చేసేవారికే పట్టం కట్టండి

"ఇక్కడ ప్రజలు మాజీ సీఎం కేసీఆర్‌ను ఓడించారు, ప్రస్తుత సీఎంను మూడో స్థానంలో నిలిపారు. కానీ అభివృద్ధి మాత్రం ఆగదు. శిలాఫలకాలు వేయనివ్వకపోయినా, అడ్డంకులు సృష్టించినా కామారెడ్డిని అభివృద్ధి చేసి తీరుతా" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసే వారికే ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.నిజామాబాద్ ఇన్‌ఛార్జ్ పదవిలో ఉన్నప్పటికీ, తన సొంత గడ్డ అయిన కామారెడ్డి అభివృద్ధి కోసం నిరంతరం తాపత్రయపడతానని షబ్బీర్ అలీ పునరుద్ఘాటించారు

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బాటసారులకు అన్నదానం

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, జనవరి 18:

సిద్దిపేట వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మాఘ అమావాస్య సందర్భంగా వాసవి మిత్రమండలి సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైశ్యభవన్ వద్ద బాటసారులకు అన్నప్రసాద వితరణ చేపట్టగా, గోశాలలోని గోవులకు ఆహారంగా ఆకుకూరలు, కూరగాయలు అందజేశారు.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గంప కృష్ణమూర్తి, రీజియన్ చైర్మన్ చింత రాజేంద్రప్రసాద్, డీఎస్ఓ చకిలం రవి, క్లబ్ అధ్యక్షుడు కూర శ్రీనివాస్, గ్రీటింగ్ చైర్మన్ మర్యాల వీరేశం తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

తాపీ మేస్త్రి సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

- అధ్యక్ష,ఉపాధ్యక్షులుగా సూరం లక్ష్మన్న, ఖాజ మైనోద్దీన్.

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్ జిల్లా జనవరి 18

నర్వ మండలంలోని రాయికోడు గ్రామ తాపీ మేస్త్రీ సంఘం నూతన గ్రామ కమిటీని ఆదివారం ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర మేస్త్రీల సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా సూరం లక్ష్మన్న, ఉపాధ్యక్షులుగా మేస్త్రి ఖాజా తో పాటు మరో పదిమంది కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష ఉపాధ్యక్షులు మాట్లాడుతూ మేస్త్రీల హక్కులను కాపాడేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం తరపున రావాల్సిన అన్ని రకాల పథకాల ద్వారా లబ్ది పొందే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ అద్యక్షులు పి నర్సింలు, ఉపాద్యాక్షులు మ్యాతారి ఆనంద్, మేస్త్రిలు సూరం నాగేష్, యం. అజయ్,వై ఆనంద్, యం. పురుషోత్తం, యం. రాము, బాయికాడి భీమేష్,కే రవి, నర్సింలు, కే ఆనంద్, కృష్ణ, డి శివ తదితరులు పాల్గొన్నారు.

బహుళ

సందర్భం

అబాకస్... ఆవిరియంత్రం వాట్ అద్భుతాలే

ఒకరోజు వాట్ పొయ్యి మీద మరుగుతున్న నీరు పాత్ర పై ఉన్న మూతను పైకి ఎగరగొడుతుండడం గమనించాడు.ఆవిరి బరువైన వస్తువులను ఏ విధంగా పైకి లేపుతుందో గ్రహించాడు.చల్లని వస్తువులను తగిలినప్పుడు ఆవిరి ఏ విధంగా నీరు అవుతుందో గమనించాడు. క్రమంగా అతనికి శాస్త్ర విషయాలపై ఆసక్తి కలిగింది.

సుధాకర్.ఏ.వి
9000674747

తపన ఉంటే ఏదైనా సాధించొచ్చు. ఇది చాలామంది..చాలా సందర్భాల్లో చెప్పే మాటే. కానీ..ఇది నిజం. జేమ్స్ వాట్ కాలంలోనే ఇది నిరూపితమైంది. జేమ్స్‌కు ఆర్థిక సమస్యల్లేవు. పైగా అమ్మానాన్న చదువుకున్నవాళ్లు. ఎంతంటే అంత..ఏదంటే అది చదవొచ్చు. అయినా బడికి వెళ్లలేదు..చదువుకోలేదు. కానీ.. ఏదైనా సాధించాలని అనుకున్నాడు.ఛేదించి.. శోధించి ..సాధించాడు. తపన ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించాడుపరిశోధనా శక్తి అనేది ఎంతటి కష్టాలనైనా భరిస్తుంది. అనారోగ్యం, ఆర్థికలేమి శరీరాన్ని కృషింపజేసినా ఆసక్తి, పట్టుదలలు వాటిని పటాపంచలు చేసి ఒక మార్గాన్ని సూచిస్తూ లక్ష్యాన్ని చేరుకునేలా చేస్తుంది. అలాంటి కోవకు చెందిన వ్యక్తి జేమ్స్ వాట్ .ఈయన స్కాట్లాండ్ లోని గ్రీనాక్ అనే పట్టణంలో 1736 జనవరి 19న జన్మించాడు. బాల్యంలో విద్యాభ్యాసానికి అనారోగ్యం అడ్డు తగిలినా తల్లి చొరవతో అక్షరాలు నేర్చాడు. చిన్నతనం నుంచి గణితం పై ఆసక్తి,పనిలో చురుకు,అద్భుతమైన జ్ఞాపకశక్తి ఉండేవి. తండ్రి ఇచ్చిన వడ్రంగపు పనిముట్లతో చిన్న చిన్న బొమ్మలు తయారు చేసేవాడు.తీరిక సమయాల్లో చిన్న చిన్న పరికరాలతో ప్రయోగాలు చేస్తుండేవాడు. ఒకరోజు వాట్ పొయ్యి మీద మరుగుతున్న నీరు పాత్ర పై ఉన్న మూతను పైకి ఎగరగొడుతుండడం గమనించాడు.ఆవిరి బరువైన వస్తువులను ఏ విధంగా పైకి లేపుతుందో గ్రహించాడు. చల్లని వస్తువులను తగిలినప్పుడు ఆవిరి ఏ విధంగా నీరు అవుతుందో గమనించాడు. క్రమంగా అతనికి శాస్త్ర విషయాలపై ఆసక్తి కలిగింది. తండ్రి వడ్రంగ దుకాణంలో ఓడలు నిర్మించడంలో ఉపయోగించే యాంత్రిక శాస్త్ర ప్రధమ సూత్రాలు నేర్చుకున్నాడు.ఒకసారి ఓ చిన్న నమూనా యంత్రాన్ని మరమ్మత్తు చేయాల్సి వచ్చింది. అలా అది పని చేసే విధానంపై ఆసక్తి పెరిగి కొన్ని లెక్కల ద్వారా దానిలోని లోపాలను గనించాడు.ఆవిరి ఉత్పత్తి చేసే బాయిలర్,దానిని చల్లబరిచే కండెన్సర్ రెండు ఒకటిగా కాక వేర్వేరుగా ఉంటే శక్తి చాలా ఆదా అవుతుందనేది ఆవిరిశక్తి శాస్త్రంలోని అతడు కనిపెట్టిన ఒక మహత్తర విషయం. ఇందువల్ల ముసలకం చలింటప్పుడు ఉష్ణోగ్రత తగ్గిపోవాల్సిన అవసరం లేదు. ఈ సూత్రాల ఆధారంగా ఒక నమూనా యంత్రాన్ని తయారుచేశాడు. అయితే ఏ లోపాలు లేని పూర్తి పని చేసే యంత్రాన్ని తయారు చేయడానికి ఆర్థిక బలం లేక ఎన్నో అవస్థలు పడ్డాడు.

1765లో ఒక ఇంజన్‌ను డిజైన్ చేశాడు. అందరూ ఆశ్చ



ర్యపోయారు. ఎందుకంటే ఆ ఇంజిన్ పనితీరు చాలా సరళంగా ఉంది. మార్పు ఏంటో చేసి చూపెట్టాడు. ఇంతకూ వాట్ చేసింది ఏంటంటే.. సిలిండర్లకు ప్రత్యేకమైన ఒక కండెన్సర్ అమర్చి శక్తి వృథా అవ్వకుండా నివారించాడు. ఆవిరి ఇంజిన్ల శక్తి సామర్థ్యం ఏంటో చూపించాడు. వీటి ద్వారా ఖర్చును ఎంత తగ్గించవచ్చో చూపెట్టాడు. 1781వరకు కార్నివాల్‌లో ఎక్కువ కాలం గడిపాడు. అక్కడ రాగి, టిన్ గనుల కోసం అనేక పంపింగ్ ఇంజిన్‌లను తయారుచేశాడు. వీటి ఇంధన ఖర్చులు తగ్గించాలనే ఆలోచనతో 1782లో డబుల్ యాక్టింగ్ ఇంజిన్ తయారుచేశాడు. ఈ సమయంలో పార్టనర్‌తో గొడవ అయ్యింది. సమాంతర చలన ఆవిష్కరణతో పిస్టన్ రాడ్‌ను బలంగా నడిపించే అనుసంధానమైన రాడ్‌ల అమరికతో వీటిని తయారుచేశాడు. లండన్ లోని మ్యాథ్యూబోల్టన్ అనే ధనికుడి ఇనుప కర్మాగారాన్ని వాట్ సందర్శించాడు.అక్కడ పనిచేసే యంత్రాలన్నీ నీటి ప్రవాహ వేగంతో తిప్పబడేవి. బోల్టన్ ప్రోత్సహంతో వాట్ తన పూర్తి కాలాన్ని ఆవిరి యంత్రాల లోపాల మీదే వినియోగించి, దానిని సరిచేయగలిగాడు. వాట్ ఆవిరి యంత్రం కొద్ది కాలంలోనే కారన్ వాల్ తగరపు గనులలో తక్కువ ఖర్చుతో ఎక్కువ లోతు నుండి వేగంగా నీటిని తొడడం ప్రారంభించింది. వాట్ అంతటితో ఆగలేదు ఆవిరి యంత్రపు బాయిలర్ లో పీడనం ఎంత ఘనపరిమాణంలో ఉన్నదో తెలిపే యంత్రం,ఆవిరి యంత్రం వేగం హెచ్చుతగ్గులకు ఒక పద్ధతిని కనుగొన్నాడు. బరువులు లాగడానికి,నీళ్లు తోడడానికి, నీళ్లు నింపడానికి వీలుగా ఆవిరి యంత్రాన్ని మార్పులు చేశాడు.అన్ని విధాలుగా పని చేయడం మొదలు పెట్టాకే ఆవిరి యంత్రానికి చాలా ప్రశంసలొచ్చాయి. కొద్ది కాలంలోనే ఆవిరి యంత్రం ప్రతి పరిశ్రమకు మూలంగా ఉండవలసిన యంత్రంగా ప్రచారంలోకి వచ్చింది. ఆవిరి యంత్రంతోపాటు చిన్న యంత్రం సహాయంతో రాతకు నకళ్ళు తీసే పద్ధతి కనుకున్నాడు.క్లోరిన్ వాయువుతో బట్టలు విరంజనం చేయడం, లెనిన్, ముస్లిన్ వస్త్రాలను పొడిగా చేసే యంత్రం,ద్రవపదార్థాల విశిష్ట గురుత్వాన్ని కనుగొనే పరికరాన్ని కనుగొన్నాడు. వాట్ తన మహత్తర కృషికి గుర్తింపుగా ఎన్నో గౌరవాలను పొందాడు.వివిధ సంస్థలను ప్రోత్సహిస్తూ పెద్ద మొత్తాల్లో ధన సాయం చేశాడు.

జనవరి 19 జేమ్స్ వాట్ జయంతి

**వ్యాసకర్త రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
స్టేట్ టీచర్స్ యూనియన్**

పరిచయం

సంతాలి సాహిత్యరచన

గిరిజన మహిళాచింతన మెరిసే ఆదిత్య కిరణం నిర్మల పుతుల్

డా.టి.రాధాకృష్ణమాచార్యులు
9849305871

పోరాటాలమయమే ఆమె జీవితంగా బాల్యం నుండి ఎదిగి వచ్చిన సామాజిక సాహితీ అక్షరం సంతాలి నిర్మల పుతుల్. 'మృదంగాల్లా (డ్రమ్స్) ధ్వనించే పదాలు ' పరుకున్న 'నా ఇంటి అన్వేషణలో ' దుందుభిలా కవిత్వ విన్యాసంచేసే రచన ఆమె సొంతం. పేదరికం,వివక్ష,సామాజిక న్యాయం వంటి రుగ్మతల పరిష్కారానికి, మహిళాభ్యుదయానికి విద్య ఏకైక శతారంగా నమ్మి ఆలోచించి ఆచరణలో చూపిన ప్రఖ్యాత సంతాలి కవయిత్రి ఆమె. జార్ఖండ్ రాష్ట్రంలోగల సంతాల్ పరగణలో దుమ్కా జిల్లాలోని దుధ్ని కురువ గ్రామంలో మార్చి 6,1972లో ఒక గిరిజన కుటుంబంలో జన్మించిన నిర్మల పుతుల్ తల్లిదండ్రులు తల్లి కందాని హన్స్దా,తండ్రి సిరిల్ ముర్ము.ఆమె బాల్యం సమస్యల వలయంలో గడిచింది. బాల్యంలో ఆమె జీవితం పోరాటాలతో గడిచింది ఆమె తండ్రి, మామ ఉపాధ్యాయులుగా పనిచేయడంతో ఇంటిలో విద్యా వాతావరణం ఉండి కూడా జీవనోపాధి కోసం జరుగుతున్న పోరాటాలు ఆమె సాధారణ చదువులకు అంతరాయం కలిగించినా ప్రాధమిక విద్యను దుద్నిలో చదివిన ఆమె దుమ్కా జిల్లాకేంద్రంలో రాజనీతిశాస్త్రం (ఆనర్స్)లో చదివి డిగ్రీ పట్టా అందుకున్నది. నర్సుగా మారడం వల్ల ఆర్థిక ఇబ్బందుల నుండి విముక్తి లభిస్తుందని భావించి, ఆమె నర్సింగ్‌లో డిప్లొమా చదివి, కొంతకాలం తర్వాత, ఇగ్నో నుండి బ్యాచిలర్ డిగ్రీని కూడా పొందింది. ఆమెకు ఇప్పటికే సంతాలి సమాజంతో, దాని భావోద్వేగ సున్నితత్వాలతో లోతైన సంబంధం ఉండేది. నిర్మలా పుతుల్ సాహిత్యం సంతాలి భాషలో,హిందీలో రచించారు.ఆమె నిర్మల పుతుల్ సాహిత్యం తన మాతృభాష సంతాలి గిరిజన భాషలో తెచ్చారు. అందులో 'ఇన్×ఆక్ ఓడక్ సెంద్రారీ' ప్రచురించారు.అలాగే 'ఓనోంధైన్ సంతాలి కవితా సంకలనం కలదు.ఇక హిందీలో కవితా సంకలనం 'డ్రమ్ లాగా మోగుతుంది', 'ఒకరి ఇంటి అన్వేషణలో ' ప్రచురించారు. మరో సంకలనం 'కొత్త తిరుగుబాటు చెలరేగుతుంది' ఉన్నది.ఆమె కవిత్వం ఉర్దూ, ఒరియా, కన్నడ, నాగపురి, పంజాబీ, నేపాలీ వంటి అనేక భాషల్లోకి అనువాదవయ్యాయి. ఆమె కవితలు, వ్యాసాలు లాహ్మా ,ది బుక్ ఏసియా వంటి ప్రసిద్ధ మ్యాగజైన్లలో ప్రచురితం. ఆకాశవాణి,దూరదర్శన్ రాంచీ,భాగల్ పూర్,డిల్లీలలో ప్రసారమయినవి.ఆమె కవితలు ఎన్.సి.ఇ.ఆర్.టి. న్యూడిల్లీ ద్వారా జార్ఖండ్,బీహార్, జమ్ము&కాశ్మీర్ లలో 11వ,తరగతి పాఠ్యపుస్తకాలలో చేర్చబడినవి. అట్లాగే ఎన్.సి.ఇ.ఆర్.టి. కేరళ విద్యాశాఖచే 8వ,తరగతి పాఠ్య పుస్తకంలో కూడా చేర్చబడినవి.కాలానుగుణంగా అనేక స్థానిక, జాతీయ స్థాయి వార్తాపత్రికలు, మ్యాగజైన్‌లలో రచనలు,వ్యాసాలు కూడా ప్రచురితం. నిర్మల పుతుల్ ఎన్నో సాహిత్య సన్మానాలు,గౌరవాలు అందుకున్నారు. ఆమె సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ 2001లో సాహిత్య సమ్మాన్ 2006లో జార్ఖండ్ ప్రభుత్వంచే 'రాజ్య సమ్మాన్,' హిందీ సాహిత్య పరిషత్ వారి స్మృతి సమ్మాన్, 2006లో మిజోరాం ప్రభుత్వంచే 'భారత్ ఆదివాసీ సమ్మాన్ 'వంటివి అందుకున్నారు. ఇంకా 2008లో మహారాష్ట్ర రాష్ట్ర హిందీ సాహిత్య అకాడమీ నుండి సత్కారం, హిమాచల్ ప్రదేశ్ హిందీ సాహిత్య అకాడమీ సత్కారం వంటివెన్నో ఆమెను వరించాయి.

అట్లనే హైదరాబాద్ హిందీ విశ్వవిద్యాలయం (హైదరాబాద్) ఆడియోవిజువల్ 2010లో జాతీయ చలనచిత్ర అవార్డును అందుకున్న ఆమె జీవితం ఆధారంగా రూపొందించబడిన చిత్రం 'బురుగర' . ఆమె తన మొత్తం సమయాన్ని రచన, సామాజిక మరియు విద్యా పనులకు అంకితం చేస్తున్నారు. సంతాలి కవయిత్రి నిర్మల పుతుల్ ఒకవైపు సంతాలీ సాహిత్యం మరోవైపు విద్యా రంగంలోనూ జార్ఖండ్ ప్రాంతాల పల్లె జీవితం, దళితులు, గిరిజనులు, బహుజన తెగజాతిలో మహిళల విద్యకోసం సామాజిక ఆర్థిక అవగాహన కోసం పడే తపన,వారిలో చైతన్యం రగిలించే ప్రయత్నం ప్రతుల్ రక్తంలో ప్రవహిస్తుంది.ఆ సాధన దిశలో ఆమె ఆలోచన నరనరాలలో ఊపిరిగా జీవిస్తుంది.ఇక గిరి శిశువు,గిరి పురుషుడు,గిరి స్త్రీ వంటి ప్రసిద్ధ కవితలు నిర్మల పుతుల్ కలం నుండి జాలువారినవే. అందులో నిర్మల పుతుల్ కవిత మౌంటెన్ చైల్డ్ కు రెండు స్టాంజాలు నా తెలుగు అనువాదంతో...

"పర్వత శిశువు"

గిరుల శిఖరాలు కనిపించే
చిన్న ముక్కల సమూహం
పర్వత శిశువులా ఆడుతుంది
రక్షణలేని మెట్లపై నుండి ఎక్కుతుంది పర్వతాన్ని
ఎక్కడం తడబడుతూ,
తడబడుతూ మెట్లు
నేలపై పర్వత మట్టి జారడం
కాలినడకన పర్వత మట్టిని దిద్దడం
పర్వతం లాంటి వాతావరణం
పూర్తి బలంతో పెరగడానికి...
అంటూ ఇలా సాగుతుంది మిగతా కవిత...

కవిత

బాధా తప్తం

ఫజుల్ అంటే అక్షరాలకు విజిల్
పద పదాల బుల్ బుల్ పిట్ట కూత
వాక్యమొక పచ్చని వార్తా వ్యవసాయం

ఎల్లకాలం విస్తరించిన స్నేహ హస్తం
మర్మమెరగని నిష్కల్మష జీవన యానం

వార్తలు వ్యాఖ్యల అక్షరాలే ఆయుధం
నైతికత నిర్భీతి పాత్రికేయ ప్రయాణం

హుస్నాబాద్ లో అంకురించిన అక్షరం
హైదరాబాదులో వృక్షంగా ఎదగకముందే
అర్ధాయువుతో అలసి నిలిచిపోయింది

మిత్రమా !రహమాన్
ఇక నీవు జ్ఞాపకాల మేలు కొలుపు.

- అన్నవరం దేవేందర్

సమీక్ష

అనుభవ వేదనల కల నేత స్పర్శ లేని శిల

డా: అమ్మిన శ్రీనివాసరాజు
77298 83223.

వేదన జీవి ఉన్నతికి సోపానం కావాలి తప్ప మనిషిని వేకుంగ తీసే గుదిబండ కారాదు, మానవ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని ముందుకు నడిచి విజయ పతాక చేబూనిన మన జీవనమే పలువురికి ఆదర్శం, అదే అసలైన జీవితం కూడా...!! మరి వేదనలు ఎదుర్కొనే ఆత్మస్థైర్యం అందేది అక్షరాల రస చెలిమ, ఆత్మీయత నిస్వార్థం నిండిన చేయూత చెలిమి మాత్రమే...!! అటువంటి ఊరట ఊతం అందించేదే వర్ధమాన కవయిత్రి ఎన్ .లహరి వెలువరించిన కవన పేటిక "స్పర్శ లేని శిల" లహరి ఎదుర్కొన్న పెనుసవాళ్ళ తాలూకా అనుభవ సారాలే ఈ కవితా బిందువులు అనిపిస్తుంది, ఈ కవితలను మనోనేత్రంతో స్పర్శించి చదివితే...!! తెలుగు సంవత్సరాల సంఖ్యను పోలిన ఈ కవితలు మొత్తం సామాజిక స్వీయ అనుభవాల అనుభూతుల మయం, మనిషి జీవితంలో మౌనం కు గల ప్రత్యేకత మరి దేనికి లేదేమో అనిపిస్తుంది స్పర్శ లేనిశిల తాకితే.. ఎంతటి నిరుత్సాహక సమయమైన భయానక వాతావరణంలో నైనా.. చిన్ని ఆశ గోరంత ఆత్మస్థైర్యం తోడైతే ఊహించని విజయానికి చేరువ కావడం ఏమంత కష్టం కాదు, అనే భరోసా కూడా ఈ కవితా భావన ద్వారా మనకు అందుతుంది, దూరమవుతున్న మానవతా విలువలు, పెరిగిపోతున్న దురహంకార భేదాలు, తదితర మోసపూరిత పనులను అంతం చేయాలని అందుకోసం అక్షర దండయాత్ర చేద్దాం అంటూ పిలుపునిచ్చింది సామాజిక స్పృహ నిండుగాగల లహరి,

స్వతహాగా స్త్రీ తత్వం నిండిన ఈ కవయిత్రి స్త్రీ అన్యాయాలపై స్పందించే వేళ గొంతు శబ్దం పెరుగుతుంది, కఠిన పదాల స్వరలయలు వెలుపడతాయి, మాటలతో మనసులను గాయపరిచే వారికి, వెన్నుపోటు దారులకు, చురుకైన హెచ్చరికలు చేస్తూ... ఒకవైపు స్త్రీ ఔన్నత్యం ఔదార్యం ప్రదర్శిస్తూనే... స్త్రీ అంటే శిల కాదు/ నీ గోళ్ళతో చెక్కడానికి/ శిరస్సు వంచి దండం పెడితే/ కనీసం మరో జన్మలోనైనా /ఓ అమ్మకు మంచి బిడ్డగా పుడతా

స్పర్శలేని శిల (కవిత్వం),

పేజీలు: 120, వెల: 150/- రూ,
ప్రతులకు: కవయిత్రి సెల్: 98855 35506.



వేమో!../ అంటుంది కవయిత్రి. మనిషి తన స్వార్థంతో పర్యావరణాన్ని విచ్ఛిన్నం చేస్తూ భావి సమాజానికి విఘాతం కలిగిస్తున్న చేష్టల గురించి నిగ్గు తీస్తూ నిజం చెప్పమని పంచభూతాల సాక్షిగా ప్రాధేయపడుతుంది "నిజం చెప్పగలవా" కవితలో..., స్త్రీ మూర్తి నిరంతర పరిశ్రమకు తగిన భావనను "ఆమె ఓ జీవనది" కవిత ద్వారా భావోద్వేగ చైతన్య బావుటాగా అందించారు, అదే స్త్రీ చైతన్య సూచికగా నిలిచేది, ఓదార్చేది అదే....! తంగేడు పూలు, వరకట్నపు విష బీజం, కవితల్లో వనితలకు సభ్య సమాజంలో ఎదురయ్యే అవరోధాల గురించి వివరిస్తూనే.. కర్తవ్య బోధన చేశారు.. స్త్రీ జాతికి చిక్కని చైతన్యం నింపుతూ.. మహిళా మణిని స్ఫూర్తి, కీర్తి ,ధైర్యం, స్థైర్యాలకు, ప్రతిరూపంగా చూపుతూ... కాలికింద మట్టిలా నలిగిన కాలం నుండి/ కాళికలా కనకదుర్గలా.../ వివక్ష పై కదం తొక్కి కత్తుల్ని దూసింది/ఉవ్వెత్తున ఎగిసి రణనాథమయ్యింది/ ఉజ్వల వెలుగై దేశ నినాద మయ్యింది!/... అంటూ నేటి ఆధునిక మహిళా కర్తవ్యాన్ని హితోపదేశం చేస్తుంది "లహరి" "వెలుగుదివ్వె"కవిత ద్వారా.. మరోవైపు మానవతా కోణం మానవ సంబంధాలను ఆవిష్కరిస్తూ... అమ్మమ్మ లేని ఇల్లు, ఊరు మారింది, తదితర కవితలు అందించారు. విరామ సమయం, ఎదురు చూపులు, శిశిర దేహం, లాంటి కవితల్లో నిగూఢ మైన భావుకత అంతులేని ఆర్తి అగుపిస్తాయి, సమాజంలో జరుగుతున్న మానవ విద్రోహాల పట్ల జాగృతం చేసే నిజమైన సామాజిక స్పృహ గల కవి లక్షణాలు అక్షరాల పాటిస్తూ.. సైబర్ మోసం, రక్కసి మూక రగిల్చిన కాష్టం, వంటి కవితలు అందించారు. స్తబ్దంగా ఉన్న చలనరహిత సమాజాన్ని తనదైన కవన బావుటా ద్వారా చైతన్యం దిశగా అడుగులు వేయించాలన్న లహరి ఆశయం నెరవేరాలని ఆశిస్తూ... ఆ అక్షర చైతన్యాన్ని స్వీకరించే స్పృహగల రస హృదయులంతా ఈ "స్పర్శ లేని శిల" ను తప్పకుండా మనసుతో చదవాలి.

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

కొమురవెల్లిలో పట్నంవారంకు పోటెత్తిన భక్తులు

- భారీగా తరలివచ్చిన హైదరబాద్ యాదవ భక్తులు.
- మల్లన్న నామస్మరణతో మారుమోగిన ఆలయ ప్రాంగణాలు.
- స్వామి దర్శనానికి శీఘ్ర, విశిష్ట దర్శనం ఐదు నుంచి ఏడు గంటల సమయం.

ప్రతిపక్షం, కొమురవెల్లి, జనవరి 18:

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో జాతర బ్రహ్మోత్సవాలలో భాగంగా పట్నం వారం (మొదటి ఆదివారం)కు భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో నిండి సందడి నెలకొంది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడుతూ దప్పుచప్పుల నాధాలతో మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. హైదరాబాద్, సికిందరబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి పట్టణాలకు చెందిన సుమారు 50 వేల నుంచి లక్ష మంది భక్తులు తరలివచ్చారు. భక్తులు ఆలయానికి చేరుకుని గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి పట్నాలు వేసి భోనాలు చెల్లించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుండే స్వామిని దర్శించు కోవడానికి ఉచిత ధర్మదర్శనం, శీఘ్ర దర్శనం విశిష్టదర్శనం రూ.250 క్యూలైన్ల గుండా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మల్లికార్జునస్వామిని దర్శించుకోవడానికి ధర్మదర్శనంలో సుమారు ఐదు నుంచి ఏడు గంటల సమయం పట్టింది. మల్లన్నను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులతో రాజగోపురం నుంచి ఎల్లమ్మ కమాన్ మీదుగా మల్లన్న భక్తులు నిలిచిపోయ్యారు. కొమురవెల్లిలోని ఐనాపూరు రోడ్డులో ఎల్లమ్మ ఆలయం వరకు, వైజంక్షన్ వద్ద భక్తులు నిలిచిపోగా బస్టాండ్ సమీపంలోని అన్ని పార్కింగ్ ప్రదేశాలు, కురుమ సత్రం దాటిన ఖాళీ ప్రదేశాలలో భక్తులు గుడారాలు ఏర్పాటు చేసుకుని విడిది చేశారు. పోలీసులు అధికారులు జాతర ప్రాంగణాలలో కెమెరాలతో మానిటరింగ్ చేసుకుంటూ అన్ని ప్రభుత్వశాఖ అధికారులతో సమన్వయంతో జాతర బ్రహ్మోత్సవాలు పర్యవేక్షిస్తున్నారు.

మల్లన్నకు ప్రత్యేక పూజలు...

కొమురవెల్లిలో పట్నంవారంతో 20262027మల్లన్న జాతర బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడంతో మల్లన్నకు మొక్కులు చెల్లించు కోవడానికి భక్తులు భారీగా తరలివచ్చి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు మల్లన్న కోనేరులో తలారు స్నానాలు చేసి ఒక్కపొద్దులతో స్వామికి నైవేద్యాన్ని వండి మట్టికుండలలో భోనాలుగా అలంకరించారు. మల్లన్నకు భక్తులు తాము వండిన నైవేద్యాన్ని ఏడు, ఐదు, మూడు అంత్రాల భోనాలుగా ఎత్తుకొని శివసత్తులతో శివమూగుతూ దప్పుచప్పులతో కేరింతలు పెడుతూ మల్లన్నను స్మరిస్తూ నాట్యంతో చిందేస్తూ మల్లన్నకు మొక్కులు అప్పగించారు. అనంతరం మల్లన్న గుట్టపైన శ్రీరేణుక ఎల్లమ్మకు భోనాలతోనైవేద్యాన్నిభోనాలు ఎత్తుకొని అమ్మవారికి నైవేద్యాన్నిసమర్పించి ఒక్కపొద్దులను వదిలారు.

గుట్టపై శ్రీ రేణుక ఎల్లమ్మకు పూజలు..

తెలంగాణ జానపదుల ఆరాధ్య దైవమైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జునస్వామి జాతర బ్రహ్మోత్సవాలలో మొదటి ఆదివారం పట్నంవారంకు వచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతోగుట్టపైన శ్రీరేణుక ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లన్నగుట్టపై ఇంద్రకీలాద్రి పర్వతంపైన వెలసినశ్రీరేణుక ఎల్లమ్మకు,నల్లపోచమ్మలకు భక్తులు బోనాలు ఎత్తుకొని వెళ్ళి అమ్మవార్లకు సమర్పించి ఓడి బియ్యాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవార్ల దర్శనంకు సుమారు మూడు నుంచి నాలుగు గంటల సమయం పట్టింది.

పెద్దపట్నం, అగ్ని గుండాలకు ఏర్పాట్లు..

కొమురవెల్లిలోని శ్రీమల్లికార్జునస్వామి జాతర బ్రహ్మోత్సవాలలో మొదటి ఆదివారం, పట్నం వారంను పురస్కరించుకుని సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు హైదరాబాద్ యాదవ భక్తులు ఆలయ తోటబావి వద్ద కళ్యాణ మండపంలో పెద్దపట్నం, అగ్నిగుండాలు నిర్వహిస్తారు. అగ్నిగుండాల సమయంలో హైదరాబాద్ శివ సత్తులు, మల్లన్న భక్తులు పెద్దపట్నం దాటుతూ అగ్నిగుండాలు తొక్కుతూ వెళ్ళి గర్భగుడిలో శ్రీ మల్లికార్జునస్వామిని దర్శించుకుంటారు. ఇందుకోసం ఆలయ తోటబావి వద్ద అధికారులు పెద్దపట్నం, అగ్నిగుండాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. పెద్దపట్నం, అగ్నిగుండాల సమయంలో ఏలాంటి ఆవాంచనీయమైన సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తూ ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు.

మల్లన్న ఆలయంలో రవ్వ కేసరి, అన్నదానం వితరణ..

హైదరాబాద్కు చెందిన దాతలు బండారి ప్రవీణ్ యాదవ్ తో పాటు తమ 8 మంది కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మల్లన్న ఆలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 8 కింటల్లా రవ్వ కేసరి ప్రసాదాన్ని భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. వీటితో పాటు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎనంది క్వింటాళ్ల బగారా రైస్, టమాటా కుర్మ, రైత, పాపడ్ తో కలిసి భక్తులకు అన్నదానంకు ఉచితంగా పంపిణీ చేశారు. సుమారు పదివేల మంది భక్తులకు రవ్వ కేసరి ప్రసాదం అందించి, మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు సుమారు 6000 మంది భక్తులకు బాగరా బిర్యానీతో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్బంగా అన్నదాత బండారి ప్రవీణ్ యాదవ్ మాట్లాడుతూ మల్లన్న ఆలయంలో తమ కుటుంబ సభ్యులు గత నాలుగు తరాలు నుంచి కీ.శే, బండారి అంజయ్య, క్రీ. శే, పెంటయ్య యాదవ్ ఆదేశాల మేరకు బండారి యాదయ్య ఆధ్వర్యంలో కొమురవెల్లిలో పట్నంవారం సందర్బంగా భక్తులకు మంచినీటి సరఫరాతో ప్రారంభించి పట్నంవారంకు వచ్చే భక్తులు రవ్వ కేసరి ప్రసాదంతో పాటు భగరాతో అన్నదానము ఉచిత ప్రసాదం పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రతి ఏటా సికింద్రాబాద్ మహంకాళి అమ్మ వారి జాతరతో ప్రారంభించి కొమురవెల్లి మల్లన్న ఆలయము, శివరాత్రికి ఏడుపాయల దుర్గమ్మ ఆలయంలో ఇలాగే రవ్వ కేసరి, భగారాతో అన్నదాన కార్యక్రమాలు ప్రతి ఏటా నిర్వహిస్తున్నామని తెలిపారు.

శ్రీ రామలింగేశ్వర స్వామి దయతో ప్రజలందరూ చల్లగా ఉండాలి

- కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజక వర్గం ఇన్చార్జి "చెరుకు"

ప్రతి పక్షం దుబ్బాక జనవరి 18:

శ్రీ పార్వతీ సమేత కూడవెల్లి రామలింగేశ్వర స్వామి దయతో ప్రజలందరూ చల్లగా ఉండాలి అని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజక వర్గం ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆదివారం దక్షిణ కాశీగా పిలవబడే కూడవెల్లి శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాఘమాస అమావాస్య రోజు కూడవెల్లి రామలింగేశ్వర ఆలయంలో వైభవంగా జరుపు కోవడం ఇక్కడి ఆనవాయితీ అన్నారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చిన మాండవ్య నదిలో పుణ్యస్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకుంటే సకల పాపాలు తొలుగుతాయన్నారు.జాతర ముగిసే వరకు ఆలయ ప్రాంగణంలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులకు, పకడ్బందీగా ఉత్సవ ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ చైర్మన్ ఉషయ్యగారి రాజిరెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సంకేత శర్మ, కమిటీ సభ్యులు వెలుపుల యాదయ్య, పుద్దోజు ప్రభాకర్ చారి. కమటం లతా మల్లేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల నాయకులు కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ప్రమోద్ త్యాగం చిరస్మరణీయం

- ప్రమోద్ కుమార్ స్మారక ఫుట్ బాల్ టోర్నమెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించిన పోలీస్ కమిషనర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 18 :

దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన కానిస్టేబుల్ ప్రమోద్ త్యాగం మనందరికీ చిరస్మరణీయమని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య అన్నారు. పోలీస్ శాఖ లో ఆయన సేవలు, ధైర్యసాహసాలు పోలీస్ విభాగానికి మాత్రమే కాదు సమాజానికి ఆదర్శప్రాయమన్నారు. ఆదివారం కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్ జ్ఞాపకార్ధము పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ యువత ను ప్రోత్సహించే కార్యక్రమం లో భాగంగా ఫుట్ బాల్ టోర్నమెంట్ నిర్వహించారు.ఇట్టి ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీ హాజరై ప్రమోద్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సంఘవిద్రోహ శక్తులతో పోరాడుతూ వీరమరణం పొందిన మన సహచరుడు, కానిస్టేబుల్ ప్రమోద్ స్మృతికి అంకితంగా ఈ ఫుట్ బాల్ టోర్నమెంట్ ను నిర్వహించడం అత్యంత గర్వకారణమన్నారు.ఈ టోర్నమెంట్ ద్వారా యువతలో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, ఐక్యత పెంపొందడమే కాకుండా, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరుల త్యాగాలను స్మరించుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక బలాన్ని పెంచి, సానుకూల దృక్పథాన్ని కలిగిస్తాయని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో ఆడుతూ, ప్రమోద్ త్యాగానికి నిజమైన నివాళి అర్పించాలని కోరుకుంటున్నాను. ఈ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసి, అందరికీ స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షిస్తున్నాను అని అన్నారు. నిజామాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ మధ్యకాలంలో మారుమూల గ్రామాలలో యువత డ్రగ్స్ ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు యువత కోసం క్రీడలను నిర్వహించడం జరిగిందని ఈ సందర్భంగా సే నో టు డ్రగ్స్, సే ఎస్ టు స్పోర్ట్స్ అనే నినాదం యువతకు తెలియజేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో 2020 , 2021 లో జరిగిన కోవిడ్ మరణాలకన్నా గత సంవత్సరం లో జరిగిన రోడ్డు ప్రమాద మృతులు ఎక్కువగా జరిగాయని, దయచేసి అందరూ గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్ కుమార్ కుటుంబ సభ్యులు , అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) జి. బస్వా రెడ్డి, నిజామాబాద్ ఏసిపి రాజా వెంకట్ రెడ్డి , బోధన్ ఏసిపి శ్రీనివాస్ , జిల్లా ఫుట్బాల్ ప్రెసిడెంట్ మీర్ ఫారూఖ్ అలీ , జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ పవన్ కుమార్ , జిల్లా రంజీ క్రికెట్ ప్లేయర్ అంకిత్ రెడ్డి , ఫుట్బాల్ అసోసియేషన్ సెక్రెటరీ జావీద్ , జాయింట్ సెక్రెటరీ మసూద్ , కోచ్ నాగరాజు మరియు టౌన్ సిఐ శ్రీనివాస్ రాజ్ జిల్లాలోని సిఐలు , ఎస్సైలు జిల్లా లోని ఫుట్బాల్ క్రీడాకారులు, వారి టీమ్ లు పాల్గొన్నారు.

మంజీరా యూత్ క్లబ్ అధ్యక్షుడిగా గొట్టం బైరయ్య

ప్రతిపక్షంమిడిదొడ్డి జనవరి 18

మండల కేంద్రమైన మిరుదొడ్డి టౌన్ కు చెందిన మంజీరా యూత్ క్లబ్ అధ్యక్షుడిగా గొట్టం భైరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గా గడ్డం అంజయ్య ప్రధాన కార్యదర్శిగా బోయిని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ధర్మారం దశరథం, ఉపాధ్యక్షులుగా మర్గారి స్వామి, అందె సతీష్, చెన్నై ప్రశాంత్, క్రీడా కార్యదర్శులుగా గుడ్డోల రాజు, చెన్నై లచ్చయ్య, మంగోలు భాను, మీడియా కార్యదర్శులుగా పంతకాని రామ చంద్రం, వేముల బాలరాజ్, తోట వెంకట్ రెడ్డి, సోషల్ కార్యదర్శులుగా పూస రాజు, ఎర్రోళ్ల కుమార్, గౌరవ సలహాదారులుగా పథెం నాగ భూషణం, బోయిని లక్ష్మయ్య, ఎర్రమైన బాలయ్య, సిద్దాల సత్తయ్య, చెన్నై భూపాల్,ర్యాకం మల్లేశం, అందే భూమయ్య,కాస ప్రకాష్, నేరండ్ల రాజు, అందే రామ చంద్రం,మద్దెల రాజము,చిన్నగల నాంపల్లి మద్దెల పర్శ రాములు ,గడ్డం గంగాధర్,అయ్యోరి బాలయ్య,ధర్మారం కుమార్ చెప్యాల రాములు, గున్నాల బాలయ్య, సుతారి రవి, కీసరి శంకర్, సత్తు శ్రీనివాస్ రెడ్డి, లగాణ్, నేరండ్ల లచ్చగౌడ్, చెన్నై నర్సిములను ఎన్నుకున్నారు

నిరుపేదలకు సేవ చేయడమే లక్ష్యం

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 18:-

పట్టణ పరిసరాల ప్రాంతాలలో ఉన్న ప్రజలకు నిరుపేదలకు సేవ చేయడంలో గ్రోస్ స్వచ్ఛంద సంస్థ ముందుండి సేవ చేయడం జరుగుతుందని గత 30 సంవత్సరాల గా నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందజేయడం జరుగుతుందని సేవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జాయ్ ముర్రే. తెలిపారు ఆదివారం మెదక్ చర్చి ప్రాగణంలో మెదక్ చర్చి కోశాధికారి గంట సంపత్ ముఖ్య అతిథిగా విచ్చేసి 32 కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఇలాంటి కార్యక్రమాలు పేద ప్రజలకు సేవ చేయడం సంతోషంగా ఉందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో చెర్రీ తదితరులు పాల్గొన్నారు.

చేగుంట మండల కేంద్రంలో కప్ టార్చ్ ర్యాలీ

- పాల్గొన్న అధికారులు

ప్రతిపక్షం, చేగుంట, జనవరి 18:

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాల మేరకు చేగుంట మండల కేంద్రంలో కప్ టార్చ్ ర్యాలీ వివిధ శాఖ అధికారులు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా 2025 సంవత్సరానికి గాను కప్ టచ్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సంద్రగు స్రవంతి సతీష్ మండల అభివృద్ధి అధికారి చిన్నారెడ్డి తాసిల్దార్ శివప్రసాద్ మండల విద్యాధికారి నీరజ ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి క్రీడా కోచ్ గణేష్ రవికుమార్ ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీక్ వివిధ శాఖ అధికారులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నాయకులు లక్ష్మణ్ వెంకటేష్ చేగుంట హై స్కూల్ నుండి గాంధీ చౌరస్తా మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది.

దుబ్బాక సర్వతో ముఖాభివృద్ధి దిశగా ముందుకు సాగాలి

ప్రతి పక్షం దుబ్బాక జనవరి 18:

దుబ్బాక నియోజక వర్గం సర్వతో ముఖాభివృద్ధి దిశగా ముందుకు సాగాలి అని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం శ్రీ కూడవెల్లి పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి వారిని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషను చైర్మెన్ బక్కి వెంకటయ్య తో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి దిశగా ముందుకు సాగాలని, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని ఆ స్వామివారిని ప్రార్థించినట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట కూడవెల్లి ఆలయం చైర్మెన్, ఉషయ్యా గారి రాజిరెడ్డి,బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతిపక్షం
Prathipaksham.in
6
హైదరాబాద్
సోమవారం
19.01.2026
@prathipaksham
prathipakshamtvtelugu

కార్పొరేట్లకు సేవ చేస్తున్న మోడీ ప్రభుత్వం

- సిఐటియు జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 18:

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికులకు వ్యతిరేకంగా చట్టాలు చేసిందని వాటిని రద్దు చేసే వరకు పోరాడాలని ప్రజలకు సిఐటియు జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. సిద్దిపేట పట్టణ కేంద్రంలో కార్మిక కర్షక పోరుబాట జీపు జాతాను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ పెట్టుబడుదారులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లు చేసిందని అన్నారు. కోడ్ల వల్ల కార్మికులు కట్టు బానిసలుగా మార్చి వారి శ్రమను దోచుకొనేవిధంగా పారిశ్రామిక యజమానులకు అనుకూలంగా మార్పు చేయడం జరిగిందన్నారు. కార్మిక సంక్షేమ చర్యలు తొలగించడం జరిగిందని, 12 గంటల పని, మహిళలు రాత్రిపూట పని చేసే విధంగా చట్టాలు తయారు చేశారని అన్నారు. వామపక్షాలు ఒత్తిడి చేసిన ఫలితంగా 2004లో ప్రారంభించిన ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి విబి జి రాంజీ పథకాన్ని తెచ్చారని ఈ పథకంలో అనేక రూపాల్లో పేదలకు ఉపాధిని దూరం చేసే విధంగా అడ్డంకులు పెట్టారని అన్నారు. దీనితో పేద ప్రజలకు ఉపాధి లేకుండా పోతుందని జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించి 200 రోజులకు పని దినాలు పెంచాలని, రోజు కూలి 600 రూపాయలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన విత్తన చట్టం ద్వారా నకిలీ విత్తనాలు తయారు చేయడానికి కార్పొరేట్ సంస్థలకు అవకాశం ఉందని, రైతులకు విత్తనాలతో గ్యారెంటీ లేకుండా పోతుందని అన్నారు కల్తీ విత్తనాలకు ఎవరు భరోసా అని ప్రశ్నించారు. నూతన విద్యుత్ చట్టం వల్ల ప్రజలకు, రైతులకు ఇస్తున్న సబ్సిడీ లేకుండా విద్యుత్ సంస్థను ప్రైవేట్ పరం చేస్తూ కార్పొరేట్ సంస్థలకు అమ్మడానికి పూనుకుంటుందని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా జనవరి 19 జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు, ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె కార్మిక సంఘాలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని కార్మికవర్గం రైతాంగం కలిసి రావాలని ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, గుర్రం నర్సిములు, వినోద, ఆస్కా నర్సిములు దబ్బేటా రాజయ్య, తదితరులు పాల్గొన్నారు

డి ఎక్స్ ఎన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

ప్రతిపక్షం నంగునూరు, జనవరి:

యువతకు శ్రమతో పాటు ఆటలు కూడా ఎంతో అవసరమని డి ఎక్స్ ఎన్ కంపెనీ యాజమాన్యం బల్విర్ సింగ్ అన్నారు. నంగునూర్ మండలం ముండ్రాయి గ్రామంలో డి ఎక్స్ ఎన్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గ్రామ సర్పంచ్ ఆవిదొడ్డి చామంతి వెంకటేశం తో కలిసి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే క్రీడలు కీలకమని పేర్కొన్నారు. డి ఎక్స్ ఎన్ సంస్థలో పని చేసే యువకులు పనితో పాటు ఆటలలో పాల్గొనడం ద్వారా మరింత ఉత్సాహంగా పనిచేయగలుగుతారని తెలిపారు. అలాగే డి ఎక్స్ ఎన్ కంపెనీలో తయారయ్యే నాణ్యమైన ఉత్పత్తులు ప్రజలకు మరింతగా పరిచయం కావాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో కూడా యువతను ప్రోత్సహించే క్రీడా కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో డా.సలీమ్, డా.సవేరా, డా, లింగం, చంద్రకాంత్, ఆనంద్ విజయ్, రామస్వామి, పిఆర్ఓ పరశురాములు డి ఎక్స్ ఎన్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, వార్డ్ మెంబర్లు యువకులు పాల్గొన్నారు.

ఎస్ఐఎస్ఎఫ్–2026కు

అన్ని ఏర్పాట్లు పూర్తి

- నేడు ప్రారంభం – జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 18:

దక్షిణ భారతదేశ విద్యార్థుల శాస్త్రీయ ప్రతిభను ప్రోత్సహించే సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ (SISF)-2026కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ఈ సైన్స్ ఫెయిర్‌ను జనవరి 19 నుంచి 23 వరకు రామచంద్రపురం మండలం కొల్లూరులోని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి ఎంపికైన 210 శాస్త్రీయ ఆవిష్కరణలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. అలాగే ఎన్‌జీవోల ద్వారా 40 సైన్స్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఫెయిర్‌ను జనవరి 19న ఉదయం 10 గంటలకు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు అధికారికంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందర్శకులకు ప్రవేశం ఉంటుందని, విద్యార్థులు, ఉపాధ్యాయులు, శాస్త్రాభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఫెయిర్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

సిద్దిపేటలో 21న మార్కండేయ జయంతి శోభాయాత్ర

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, జనవరి 18:

సిద్దిపేట పట్టణంలో ఈ నెల 21 బుధవారం సాయంత్రం 4 గంటలకు పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి శోభాయాత్రను ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షులు కాముని రాజేశం తెలిపారు. మార్కండేయ దేవాలయం నుంచి ప్రారంభమయ్యే ఈ శోభాయాత్ర పట్టణంలోని పలు వీధుల గుండా మంగళహారతులు, భజ భజంత్రీలు, సంప్రదాయ నృత్యాలతో కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో ప్రతి పద్మశాలి కుటుంబం పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సిరిగది బాలరాజ్, జిల్లా ప్రచార కార్యదర్శి ముదిగొండ శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షులు బైరి మురళి, స్వస్తిక్, బింగి సాయి, ఇరుకుల్ల స్వామి, మహిళా సంఘం అధ్యక్షురాలు గడ్డమీది నవ్య తదితరులు పాల్గొన్నారు.

పైప్ లైన్ తీసి త్రాగు నీరు అందించిన

ఆకునూరు పాలకవర్గం

ప్రతిపక్షం చేర్యాల, జనవరి 18:

చేర్యాల మండల పరిధిలోని ఆకునూరు మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 5,6,8వ వార్డుల్లో ప్రజలకు త్రాగు నీటి ఎద్దడి ఉండడంతో సర్పంచ్ కొమ్ము రవి, పాలక వర్గం గుర్తించి 5వార్డు సభ్యులు జూపల్లి కార్తిక్ రెడ్డి, 7వ వార్డు సభ్యులు ఎండి. హైమద్ లకు బాధ్యత అప్పగించడంతో తక్షణమే బాధ్యత తీసుకొని పైపు లైన్ తీసి మరమ్మతులు చేపట్టి వాగు నీటి స్వచ్ఛమైన నీరును అందించడమే లక్ష్యంగా పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి వార్డుల్లో నీటి నల్లాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొయ్యడ సందీప్, ఉప సర్పంచ్ కడారి పల్లవి భాస్కర్, వార్డు సభ్యులు తాటికొండ శేఖర్ యాదవ్, భూమని భాస్కర్, నూనె శేఖర్, అందె లక్ష్మీ,సూర అనిత సంపత్, సుంచు హేమ, ఘనపురం బాలనర్సమ్మ అంజయ్య,స్వర్గం రాజేష్, ఆత్మ కమిటీ డైరెక్టర్ నర్సింగ రావు, గ్రామస్తులు అందె అశోక్, వద్దే జనార్దన్,కన్నెమైన శ్రీనివాస్, మడిమడకల లక్ష్మరెడ్డి, సత్తయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో

ప్రజలు సుభిక్షంగా ఉండాలి!!

- వెంకట్రావుపేట వెంకటేశ్వర స్వామి జాతరలో పాల్గొన్న ఎమ్మెల్సీ డా: వంటేరు యాదవ రెడ్డి

ప్రతిపక్షం,తొగుట, జనవరి 18 :

కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండలని ఎమ్మెల్సీ డా: వంటేరు యాదవ రెడ్డి కోరుకున్నారు..వెంకట్రావుపేట లో జరిగిన వెంకటేశ్వర స్వామి జాతరలో ఆయన పాల్గొని వెంకటేశ్వర స్వామి, యోగేశ్వరాలయం, చౌడాలమ్మ, ఎల్లమ్మ దేవాలయం లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా పాడి పంటలతో ఆయురారోగ్యాలతో సస్యశ్యామలంగా ఉండాలని ఆయన కోరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కి మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, సర్పంచ్ బండారు కవిత స్వామి గౌడ్ లు ఘనంగా సన్మానించారు..తొగుట సీఐ లతీఫ్, ఎస్ ఐ లతీఫ్, రవికాంత్ రావులు జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. కార్యక్రమం లో గజ్వేల్ మాజీ జడ్పీటీసీ పంగ మల్లేశం, గజ్వేల్ మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు బెండే మధు, సర్పంచ్ లు బక్క కనకయ్య, గంగసాని రాజిరెడ్డి, నాయకులు బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, దోమల కొమురయ్య, మంగ నర్సింలు, బోయిని శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, తగరం అశోక్, సుభాష్ గౌడ్, జంగిడి బిక్షపతి, ఉప సర్పంచ్ లచోళ్ల లింగం, పులిగారి శివయ్య తదితరులు పాల్గొన్నారు..

యువత క్రీడలపై దృష్టి పెట్టాలి

ప్రతిపక్షం రాయపోల్, జనవరి 18:

గ్రామాల్లో యువత క్రీడలపై దృష్టి సారించాలని బేగంపేట సర్పంచ్ మద్దగీత ప్రవీణ్ అన్నారు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని బేగంపేట గ్రామంలో గ్రామ యువకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నీని ఆదివారం ప్రారంభించారు. ఈ టోర్నీలో ప్రథమ బహుమతి రూ.3,000, ద్వితీయ బహుమతి రూ.2,000, తృతీయ బహుమతి రూ.1,000గా నిర్ణయించినట్లు తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని యువతకు సూచించారు. గ్రామీణ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం లభిస్తుందని పేర్కొన్నారు.

మంచిర్యాల రైల్వే ట్రాక్ పై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం

ప్రతిపక్షం మంచిర్యాల జనవరి 18

మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో గల రైల్వే లైను పై ఫుడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం అమలు జరిగినందుకు ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరవెల్లి రవీందర్రావు కృషివల్ల రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం 30 కోట్లతో నిర్మిస్తున్నట్లు ప్రకటించారు రఘునాథరావు ఢిల్లీలో రైల్వే మినిస్టర్ ను కలిసి అనేకసార్లు వినతి పత్రాలు ఇస్తూ ఇక్కడ ప్రజల అవసరాలను గుర్తుచేస్తూ ఫుడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేసినట్లుగా బిజెపి నాయకులు పేర్కొన్నారు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం వందే భారత్ రైలులో మంచిర్యాల స్టేషన్ రైల్వే స్టేషన్లో నిలుపదల చేయడం లాంటి కార్యక్రమాలు బిజెపి కృషివలనే జరిగిందని పేర్కొన్నారు బ్రిడ్జి నిర్మాణం వల్ల మంచిర్యాల వన్ టౌన్ టూ టౌన్ ప్రజలకు సులువైన సౌకర్యం ఏర్పడనుందని వారు పేర్కొన్నారు రాబోయే రోజుల్లో మరిన్ని ప్రజల అవసరాల నిమిత్తం అనేక సౌకర్యాలను కల్పించనున్నట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు జిల్లా రాష్ట్ర నాయకులు పట్టణ నాయకులు మరియు ప్రజలు పాల్గొనడం జరిగింది.

ముంబైలో నిర్వహించిన మారథాన్‌లో

పాల్గొన్న సిద్దిపేట రన్నర్స్

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, జనవరి 18:

ముంబైలో ఆదివారం నిర్వహించిన ముంబై మారథాన్ 2026లో సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొని విజయవంతంగా రన్‌ను పూర్తి చేశారు. ఈ సందర్భంగా మారథాన్‌లో పాల్గొన్న ప్రతినిధులు మాట్లాడుతూ.. ఏ ప్రాంతంలో మారథాన్ జరిగినా అందులో సిద్దిపేట రన్నర్స్ పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. 42.1కిలోమీటర్ల రన్‌ను విజయవంతంగా పూర్తిచేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారపు అలవాట్లతో పాటు వాకింగ్, జాగింగ్, యోగా, ధ్యానం లాంటివి చేయాలని తెలిపారు. మారథాన్‌లో పాల్గొన్న వారు సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నునేగాని రాజు, డాక్టర్ వీరన్న, కీసర రమేష్, కీసర విజయ్‌కుమార్, గందె అశోక్, నిమ్మ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మేడారంలో సీఎం రేవంత్ రెడ్డి

అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 18

రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా హైదరాబాద్ వెలుపల కేబినెట్ సమావేశం నిర్వహించడం విశేషమైన నిర్ణయం. మేడారం మహాజాతర సందర్భంగా, సమ్మక్క-సారలక్కల పవిత్ర సన్నిధిలో ఈ సమావేశం జరగడం ఒక చారిత్రక ఘట్టం. ప్రజల విశ్వాసాలు, ఆచారాలు, సంప్రదాయాలకు గౌరవం ఇచ్చే విధంగా ప్రభుత్వం ముందడుగు వేసింది.ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను ప్రభావితం చేయనున్నాయి.మేడారంనుంచి వెలువడే నిర్ణయాలు రాష్ట్రవ్యాప్తంగాకీలక ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి.

మేడారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన

మంత్రివర్గ సమావేశం ప్రారంభమైంది

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 18

రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా హైదరాబాద్ వెలుపల కేబినెట్ సమావేశం నిర్వహించడం విశేషమైన నిర్ణయం. మేడారం మహాజాతర సందర్భంగా, సమ్మక్క-సారలక్కల పవిత్ర సన్నిధిలో ఈ సమావేశం జరగడం ఒక చారిత్రక ఘట్టం. ప్రజల విశ్వాసాలు, ఆచారాలు, సంప్రదాయాలకు గౌరవం ఇచ్చే విధంగా ప్రభుత్వం ముందడుగు వేసింది. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను ప్రభావితం చేయనున్నాయి. మేడారం నుంచి వెలువడే నిర్ణయాలు రాష్ట్రవ్యాప్తంగా కీలక ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి.

ట్రంప్ సుంకాలపై ఈయూ ఖండన

గ్రీన్‌లాండ్ విషయంలో తమ విధానాన్ని వ్యతిరేకిస్తున్న 8 ఐరోపా దేశాలపై 10 శాతం అదనపు సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీన్ని ఐరోపా దేశాలు తీవ్రంగా ఖండించాయి. తప్పుడు చర్యగా బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ స్పందిస్తూ.. ట్రంప్ నిర్ణయం ఆమోదయోగ్యం కాదని తెలిపారు. మరోవైపు.. అమెరికా తీరుకు వ్యతిరేకంగా గ్రీన్‌లాండ్, డెన్మార్క్‌లలో వేలాది మంది నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.''నాటో సభ్య దేశాలుగా గ్రీన్‌లాండ్ భద్రత కోసం చర్యలు తీసుకుంటే.. సుంకాలు విధిస్తామని హెచ్చరించడం పూర్తిగా తప్పు. ఈ విషయాన్ని నేరుగా అమెరికా యంత్రాంగంతో తేల్చుకుంటాం'' అని కీర్ స్టార్మర్ అన్నారు. ''సుంకాల బెదిరింపులు ఆమోదయోగ్యం కాదు. ఎటువంటి బెదిరింపులకూ లొంగేది లేదు'' అని మెక్రాన్ వ్యాఖ్యానించారు. ''చైనా, రష్యా పండగ చేసుకుంటున్నాయి. మిత్రదేశాల మధ్య విభేదాల వల్ల ప్రయోజనం పొందేది ఆ దేశాలే'' అని ఈయూ ఫారిన్ పాలసీ చీఫ్ కాజా కల్లాస్ పేర్కొన్నారు. తమను బ్లాక్‌మెయిల్ చేయలేరంటూ స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్సన్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ చట్టాన్ని కాపాడుకునే విషయంలో ఈయూ ఎల్లప్పుడూ దృఢంగా ఉంటుందని యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా అన్నారు. ట్రంప్ ప్రకటన ఆశ్చర్యకరమని డెన్మార్క్ విదేశాంగ మంత్రి లార్స్ లోకే రాస్ముస్సేన్ తెలిపారు. తమ దేశ భద్రత విషయంలో గ్రీన్‌లాండ్ ఎంతో ముఖ్యమని, దాన్ని స్వాధీనం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్నారు. ఈ ప్రాంతం డెన్మార్క్ నియంత్రణలో ఉంది. ఈ నేపథ్యంలో ఐరోపా దేశాలు డెన్మార్క్‌కు మద్దతుగా నిలిచాయి. గ్రీన్‌లాండ్ భద్రత 'నాటో' ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, నార్వే, ఫిన్లాండ్, నెదర్లాండ్స్, బ్రిటన్‌లు అక్కడికి బలగాలను తరలించాయి.

విశ్వ వీక్షణం

దక్షిణాసియాలో వాయు కాలుష్య సంక్షోభం

నేటి కాలంలో గాలి కాలుష్యం అనేది మన ఆరోగ్యానికి, పర్యావరణానికి ఒక పెద్ద ముప్పుగామారింది. ఇది వాహనాల పొగ, పరిశ్రమల నుంచి వచ్చే ఉద్గారాలు, బొగ్గు మండించడం, నిర్మాణ కార్యకలాపాల వంటి అనేక మార్గాల ద్వారా వాతావరణంలోకి విడుదలయ్యే హానికరమైన పదార్థాలను కలిగి ఉంటుంది. ఈ కలుషితాలు గాలి నాణ్యతను తగ్గించి, శ్వాసకోశ వ్యాధులు, గుండె సమస్యలు, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో, అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఇది మరింత తీవ్రంగా ఉంది. దీనిని ఎదుర్కోవడానికి, భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించడానికి తక్షణమే చర్యలు తీసుకోవడం చాలా అవసరం ఉందని హెచ్చరిస్తున్నాయి. అయితే దక్షిణాసియా ప్రపంచంలోనే అత్యంత కాలుష్య ప్రాంతంగా మారింది. వరల్డ్ బ్యాంక్ నివేదిక ప్రకారం..ప్రపంచంలోని అత్యంత కాలుష్యభరితమైన 10 నగరాలలో తొమ్మిది దక్షిణాసియాలోనే ఉన్నాయి. బంగ్లాదేశ్, పాకిస్తాన్, భారత్ 2024లో అత్యధిక వాయు నాణ్యత స్థాయిలు (AQI) కలిగిన దేశాలలో అగ్రస్థానంలో ఉన్నాయి. ఇది ఈ ప్రాంతం ఎదుర్కొంటున్న కాలుష్య తీవ్రతను స్పష్టం చేస్తోంది.

2024 ఇండియా-పాకిస్తాన్ స్మాగ్:

నవంబర్ 2024లో తూర్పు, ఉత్తర పాకిస్తాన్, ఉత్తర భారతదేశంలో 2024 ఇండియాపాకిస్తాన్ స్మాగ్‌గా పిలువబడే తీవ్రమైన కాలుష్య పరిస్థితి ఏర్పడింది. లాహోర్, ఢిల్లీ ప్రపంచంలోనే అత్యంత కాలుష్యభరితమైన నగరాల జాబితాలో అగ్రస్థానంలో నిలిచాయి. ఉపగ్రహ చిత్రాలలో ఈ నగరాలపై గోధుమ మేఘాలు స్పష్టంగా కనిపించాయి.

కాలుష్యం ఎలా వ్యాపిస్తుంది?

ఈ ప్రాంతంలో కాలుష్య కారకాలు దేశ సరిహద్దులు దాటుతున్నాయి. గాలి సరళిలో మార్పుల వల్ల కాలుష్య కారకాలు సరిహద్దులు దాటి ప్రయాణించి, ఢిల్లీ గాలి నాణ్యతను మరింత దిగజార్చాయి. 2025లో కూడా లాహోర్, ఢిల్లీ తర్వాత అత్యంత కాలుష్యభరిత నగరంగా ఉంది. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో శీతాకాలంలో AQI స్థాయిలు మితమైన నుంచి చాలా పేలవమైన స్థాయికి పడిపోతున్నాయి. నేపాల్ రాజధాని ఖాట్మండులో కూడా AQI ఆందోళనకరంగా ఉంది. ఈ కాలుష్య కారకాల సంక్లిష్ట నిర్మాణం కారణంగా అంతర్‌ప్రాంతీయ (TransRegional) పొగమంచు ఏర్పడుతోంది.

కాలుష్యానికి కారణాలు:

పారిశ్రామిక, వాహన ఉద్గారాలు, ఘన ఇంధనాలు, వ్యర్థాలను దహనం చేయడం వంటివి దక్షిణాసియాలో కాలుష్యానికి ప్రధాన కారణాలు. ఇండోగ్యాంగెటిక్ ప్లెయిన్ ప్రాంతంలో స్థిరమైన భౌగోళిక నిర్మాణం కారణంగా సహజసిద్ధమైన గాలి ప్రసరణ తక్కువగా ఉంటుంది. దీనివల్ల కాలుష్య కారకాలు ప్రాంతమంతా సులభంగా వ్యాప్తి చెందుతాయి. వాహనాల అమ్మకాలు పెరగడం, ప్రజా రవాణా లోపం, పట్టణ పచ్చదనం తగ్గించి కాంక్రీటు నిర్మాణాలను పెంచడం కాలుష్యాన్ని పెంచుతున్నాయి. ఈ ప్రాంతంలోని దేశాల మధ్య సమన్వయం, కఠినమైన రాజకీయ సంకల్పం లేకపోవడం వలన కాలుష్య సంక్షోభాన్ని నిర్వహించడంలో వైఫల్యం ఏర్పడుతోంది. దక్షిణాసియాలో కాలుష్యం ప్రధానంగా మానవ కార్యకలాపాల వల్లనే జరుగుతోంది. WHO PM2.5 వార్షిక మార్గదర్శకాలను పాటించని నగరాలలో ఆసియా అగ్రస్థానంలో ఉంది. వాయు కాలుష్యం ప్రజారోగ్యానికి మాత్రమే కాకుండా.. దేశాల ఆర్థిక వ్యవస్థలకు కూడా తీవ్ర నష్టం కలిగిస్తోంది. దీనిని అభివృద్ధి సంక్షోభంగానూ చెబుతున్నారు.ప్రపంచ బ్యాంక్ అధ్యయనం ప్రకారం.. భారతదేశంలో అధిక AQI స్థాయిలు GDPలో దాదాపు 3% ఆరోగ్య సంరక్షణ ఖర్చులు, కార్మిక మూలధన నష్టం రూపంలో కోల్పోవడానికి కారణమవుతున్నాయి. 2019లో వాయు కాలుష్యం కారణంగా సంభవించిన అకాల మరణాలు, అనారోగ్యం కారణంగా భారతదేశ GDPలో 1.36% తగ్గింపు సంభవించింది. ఇతర నివేదికల ప్రకారం.. భారతదేశానికి ఏటా $221 బిలియన్ల వరకు ఆర్థిక నష్టం వాటిల్లుతోందని సర్వేలు చెబుతున్నాయి. వాయు కాలుష్యం కార్మికుల ఉత్పాదకతను తగ్గిస్తుంది, అనారోగ్యం కారణంగా సెలవులను పెంచుతుంది, వ్యవసాయ ఉత్పాదకతను కూడా దెబ్బతీస్తుందని చెబుతున్నారు.

ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి కేవలం తాత్కాలిక చర్యలు కాకుండా.. పటిష్టమైన దీర్ఘకాలిక వ్యూహాలు అవసరం. ఈ కాలుష్యాన్ని కేవలం ప్రాంతాల వారీగా కాకుండా.. మొత్తం ఎయిర్‌షెడ్ స్థాయిలో నిర్వహించడం అవసరం. ఎయిర్‌షెడ్ అనేది ఒకే భౌగోళిక ప్రాంతం.. ఇక్కడ కాలుష్య కారకాలు ఒకే వాతావరణ వ్యవస్థలో వ్యాపిస్తాయి. దీనికి సరిహద్దులు దాటిన సహకారం అవసరం. ఈ సమస్యను ట్రాన్స్‌నేషనల్ సమస్యగా గుర్తించి.. పొరుగు దేశాలతో సహా అన్ని స్టేక్‌హోల్డర్‌లను కలుపుకొని పోయే పాలనా నమూనా అవసరమని నిపుణులు చెబుతున్నారు. పరిశ్రమలలో, వ్యవసాయ పద్ధతులలో కఠినమైన డీకార్బనైజేషన్ చర్యలు చేపట్టాలి. శ్రమైక వర్గం, రైతుల అవసరాలను తీర్చే మానవ అభివృద్ధి నమూనాపై దృష్టి పెట్టాలంటున్నారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను మెరుగుపరచడం, పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచడం, వాహన ఉద్గార ప్రమాణాలను కఠినతరం చేయడం తక్షణ చర్యలని నిపుణులు చెబుతున్నారు. దక్షిణాసియాలో వాయు కాలుష్యం అనేది కేవలం శీతాకాలపు సమస్య కాదు.. ఇది ఈ ప్రాంతం యొక్క అభివృద్ధి, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే నిరంతర సంక్షోభం. ఈ ప్రాంతంలోని ప్రభుత్వాలు కలిసికట్టుగా.. శాస్త్రీయ ఆధారిత, దీర్ఘకాలిక పరిష్కారాలను అమలు చేయడం తక్షణావసరమని అంటున్నారు.

తొక్కిసలాట ఘటనపై సీబీఐ దర్యాప్తు..

కరూర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో టీవీకే అధినేత, నటుడు విజయ్ సీబీఐ ముందు సోమవారం మరోసారి హాజరు కానున్నారు. ఇందుకోసం ఆయన ఆదివారం సాయంత్రం ప్రత్యేక విమానంలో చెన్నై నుంచి దిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ కేసులో జనవరి 12న దాదాపు ఆరు గంటలపాటు విజయ్‌ని విచారించిన కేంద్ర దర్యాప్తు సంస్థ.. జనవరి 19న విచారణకు రావాలని నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే.గతేడాది సెప్టెంబరులో కరూర్‌లో విజయ్ ప్రచార సభ నిర్వహించగా.. అక్కడ జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తోన్న సీబీఐ, పలువురు టీవీకే నేతలను విచారించింది. మరోవైపు, ఈ కేసులో అనేక లోపాలున్నాయని చెబుతోన్న టీవీకే.. ఘటన జరిగినప్పుడు అక్కడున్న పోలీసుల సంఖ్యపైనా ముఖ్యమంత్రి, డీజీపీ వేర్వేరు ప్రకటనలు చేశారని ఆరోపించింది.



ధర్మంతోనే భారత్ విశ్వగురువుగా ఎదుగుతుంది

ధర్మంతోనే భారత్ విశ్వగురువు గా ఎదుగుతుందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధినేత మోహన్ భాగవత్ పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక పరిజ్ఞానం ప్రపంచానికి అవసరమని చెప్పారు. ముంబయిలో నిర్వహించిన 'విహార్ సేవక్ ఉర్జా మిలన్' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ''ధర్మం అనే సూత్రంపై ప్రతి విషయం ఆధారపడి ఉంది. ఇదే ప్రపంచాన్ని నడిపిస్తోంది. ఈ ఆధ్యాత్మిక వారసత్వాన్ని పూర్వీకుల నుంచి భారత్ పొందింది. మతాన్ని ఆచరించి సత్యానికి కట్టుబడి ఉండే సాధువుల సూచనలను దేశం పాటిస్తోంది. దేశం విశ్వగురువుగా ఎదగాలంటే ధర్మమే అసలైన మార్గం. ఇలాంటి ఆధ్యాత్మిక పరిజ్ఞానం ప్రపంచానికి అవసరం'' అని మోహన్ భాగవత్ వ్యాఖ్యనించారు.''ధర్మం అనే వాహనంలో ప్రయాణిస్తే ప్రమాదాలు ఎప్పటికీ జరగవు. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు, మనందర్నీ అదే చోదక శక్తి నడిపిస్తోంది. దేశాలు లౌకికంగా ఉండవచ్చు కానీ.. ఏ జీవి కూడా ధర్మానికి అతీతంగా మనుగడ సాగించలేదు'' అని మోహన్ భాగవత్ వ్యాఖ్యానించారు.

ఇరాన్ ఆందోళనల్లో మృతుల సంఖ్య 5 వేలు!

ఇరాన్‌లో ఇటీవల జరిగిన ఆందోళనల్లో వేలాది మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటివరకు ఐదు వేల మరణాలను ధ్రువీకరించినట్లు అధికార వర్గాల సమాచారం. వీరిలో సుమారు ఐదు వందల మంది భద్రతా సిబ్బంది ఉన్నారని టెహ్రాన్ అధికారులు చెప్పినట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ వెల్లడించింది.తమ దేశంలో అల్లర్లకు ఇజ్రాయెల్‌తోపాటు విదేశీ శక్తులు కూడా సాయం అందించినట్లు ఇరాన్ అధికారులు ఆరోపించారు. వేలాది మంది ఇరానీయన్ల మరణాలకు వారే కారణమన్నారు. కుర్దిష్ ప్రాంతంలో అల్లర్ల తీవ్రత ఎక్కువగా ఉందని అంగీకరించారు. మరణాల సంఖ్య ఎక్కువగా ఉండవచ్చని నివేదికలు చెబుతుండగా.. ఇవి ధ్రువీకరించిన మరణాలని, ఈ సంఖ్య గణనీయంగా పెరగకపోవచ్చని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు.మరోవైపు, నిరసనకారులపై ఇరాన్ ప్రభుత్వం హింసకు పాల్పడితే తాము జోక్యం చేసుకోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే దాదాపు 800 మందికి మరణశిక్ష అమలును ఇరాన్ విరమించుకోవడంతో ఉద్రిక్తతలు కాస్త సద్దుమణిగినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మాట్లాడుతూ.. ట్రంప్‌ను నేరస్థుడిగా పరిగణిస్తున్నామన్నారు. నిరసనకారులపై కేసులు కొనసాగుతాయని, వదలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేయడం గమనార్హం.

పోరాడి ఓడిన భారత్..

భారత్‌తో జరిగిన మూడో వన్డేలో న్యూజిలాండ్ 41 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను కివీస్ 21తో కైవసం చేసుకుంది. తొలుత న్యూజిలాండ్ 8 వికెట్ల నష్టానికి 337 పరుగులు చేసింది. లక్ష్యఛేదనకు దిగిన టీమ్ఇండియా 296 పరుగులకు ఆలౌటైంది. విరాట్ కోహ్లీ (124; 108 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సలు), నితీశ్ రెడ్డి (53; 57 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సలు), హర్షిత్ రాణా (52; 43 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సలు) పోరాడినా భారత్‌కు ఓటమి తప్పలేదు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (23), రవీంద్ర జడేజా (12), రోహిత్ శర్మ (11) పరుగులు చేశారు. శ్రేయస్ అయ్యర్ (3), కేఎల్ రాహుల్ (1) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. కివీస్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్ 3, జాక్ ఫౌక్స్ 3, లెనాక్స్ 2, కైల్ జేమీసన్ ఒక వికెట్ చొప్పున పడగొట్టారు.కివీస్ బ్యాటర్లలో డారిల్ మిచెల్ (137; 131 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సలు), గ్లెన్ ఫిలిప్స్ (106; 88 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సలు) సెంచరీలతో విరుచుకుపడ్డారు. విల్ యంగ్ (30), మైఖేల్ బ్రాస్‌వెల్ (28*) పరుగులు చేశారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా చెరో మూడు వికెట్లు పడగొట్టగా.. కుల్‌దీప్, సిరాజ్‌కు ఒక్కో వికెట్ దక్కింది.

విజయ్ హజారే ట్రోఫీ విజేతగా విదర్భ

విజయ్ హజారే ట్రోఫీ 202526 విజేతగా విదర్భ నిలిచింది. సౌరాష్ట్రతో జరిగిన ఫైనల్‌లో 38 పరుగుల తేడాతో విజయం సాధించింది. 318 పరుగుల లక్ష్యఛేదనలో సౌరాష్ట్ర 279 పరుగులకు ఆలౌటైంది. ప్రేరక్ మన్కడ్ (88), చిరాగ్ జైన్ (64) రాణించారు. సమ్మర్ గజ్జర్ (25), హర్విక్ దేశాయ్ (20), రుచిత్ అహిర్ (21) పరుగులు చేశారు. విదర్భ బౌలర్లలో యశ్ ఠాకూర్ 4, నచికేత్ భూతే 3, దర్శన్ నల్కండే 2, హర్ష్ దూబె ఒక వికెట్ తీశారు.టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన విదర్భ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 317 పరుగులు చేసింది. ఓపెనర్ అథర్వ తైడే (128; 118 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సలు) సెంచరీ చేయగా.. వన్‌డౌన్ బ్యాటర్ యశ్ రాథోడ్ (54; 61 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సలు) అర్ధ శతకం బాదాడు. అమన్ మొఖడే (33), రవికుమార్ (25), ఫైజ్ మహ్మద్ షేక్ (19), హర్ష్ దూబె (17) పరుగులు చేశారు. సౌరాష్ట్ర బౌలర్లలో అంకుర్ పన్వార్ 4, చిరాగ్ జైన్ 2, చేతన్ సకారియా 2 వికెట్లు పడగొట్టారు.

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అల్కరాజ్, సబలెంక శుభారంభం

టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియా ఓపెన్‌లో వరల్డ్ నం.1 ఆటగాడు కార్లోస్ అల్కరాజ్ టైటిల్ వేట మొదలుపెట్టాడు. ఈ సారి ఎలాగైనా ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలవాలన్న పంతంతో బరిలోకి దిగిన ఈ స్పెయిన్ ప్లేయర్ టోర్నీలో శుభారంభం చేశాడు. ఆదివారం జరిగిన తొలి రౌండ్‌లో అల్కరాజ్ 63, 76(72), 62 తేడాతో ఆస్ట్రేలియాకు చెందిన ఆడమ్ వాల్టన్‌పై విజయం సాధించాడు. రెండు గంటలకుపైగా సాగిన ఈ పోరులో అల్కరాజ్ దూకుడు ప్రదర్శించాడు. ఒక్క రెండో సెట్‌లో మినహా అతనికి ప్రత్యర్థి నుంచి పెద్దగా పోటీ ఎదురుకాలేదు. తొలి, మూడు సెట్లను అలవోకగానే నెగ్గాడు. కానీ, రెండో సెట్‌ను మాత్రం కష్టపడి టైబ్రేకర్‌లో గెలవాల్సి వచ్చింది. కానీ, మొత్తంగా అల్కరాజ్‌దే హవా. గ్రౌండ్‌స్ట్రోక్ షాట్స్‌తో విజృంభించాడు. 8 ఏస్‌లు, 38 విన్నర్లతో ప్రత్యర్థిని బెంబేలెత్తించాడు. దీంతో ఆస్ట్రేలియా ప్లేయర్ అతని ముందు నిలబడలేక 25 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు. వరల్డ్ నం.3 ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్ కూడా రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. తొలి రౌండ్‌లో కెనడా ప్లేయర్ గాబ్రియేల్ డియల్లోపై 67(17), 61, 61, 61 తేడాతో గెలిచాడు. తొలి సెట్ కోల్పోవడంతో ఆరంభంలోనే జ్వెరెవ్‌కు షాక్ తగిలింది. కానీ, ఆ తర్వాతి మూడు సెట్లలోనూ నెగ్గి మ్యాచ్ సొంతం చేసుకున్నాడు.2023, 2024లలో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ గెలిచిన వరల్డ్ నం.1 క్రీడాకారిణి సబలెంక టోర్నీని ఘనంగా మొదలుపెట్టింది. తొలి రౌండ్‌లో ఆమె 64, 61 తేడాతో ఫ్రాన్స్‌కు చెందిన రకోటోమంగాను చిత్తు చేసింది. గంటా 16 నిమిషాల్లోనే సబలెంక వరుసగా రెండు సెట్లు గెలిచింది. మరోవైపు, ఆస్ట్రేలియా దిగ్గజ క్రీడాకారిణి వీనస్ విలియమ్స్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. సెర్బియాకు చెందిన ఓల్గా డానిలోవిచ్ చేతిలో 67(57), 63, 64 తేడాతో ఓడిపోయింది. తొలి సెట్ నెగ్గి శుభారంభమే చేసినా మిగతా రెండు సెట్లలో పోరాడినా ఫలితం దక్కలేదు. వైల్డ్ కార్డు ఎంట్రీ ద్వారా 45 ఏళ్ల వయసులో ఈ టోర్నీ బరిలో నిలిచిన ఆమె ఆస్ట్రేలియన్ ఓపెన్ సింగిల్స్ ఆడుతున్న ఓల్డెస్ట్ ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పింది. అయితే, ఆమెకు తొలి రౌండ్‌లోనే షాక్ తప్పలేదు.

బంగ్లాదేశ్‌కు బిగ్ షాక్.

భారత్‌లో టీ20 ప్రపంచకప్ ఆడబోమని పంతం పట్టిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(BCB)కు బిగ్ షాక్ తగిలింది. శ్రీలంకలో ఆడేందుకు వీలు కల్పించేలా.. గ్రూప్ స్వాపింగ్ చేయాలని ఐసీసీ ని కోరిన బంగ్లా బోర్డుకు నిరాశే మిగిలింది. ఐర్లాండ్ స్థానంలో తమను గ్రూప్ బీలోకి మార్చాలని అభ్యర్థించిన బంగ్లాదేశ్ ఆశలపై క్రికెట్ ఐర్లాండ్ నీళ్లు చల్లింది. ఎట్టిపరిస్థితుల్లోనూ గ్రూప్ మారబోమని, శ్రీలంకలోనే తాము ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడుతామని ఆదివారం ఐర్లాండ్ స్పష్టం చేసింది.పొట్టి ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ మ్యాచ్‌లపై అనిశ్చితికి తెరపడం లేదు. ఐసీసీ సభ్యులు ఢాకా వెళ్లి.. ఆ బోర్డు సభ్యులతో చర్చలు జరిపినా వారు తమ నిర్ణయాన్ని మార్చుకోవడం లేదు. 'గ్రూప్ స్వాపింగ్ చేయండి.. ఐర్లాండ్‌ను గ్రూప్ సీలో.. మమ్మల్ని గ్రూప్ బీలోకి మారిస్తే మా జట్టు శ్రీలంకలో ఆడుతుంది' అని బంగ్లా బోర్డు ఐసీసీకి విన్నవించుకుంది.తమ సమస్యను పరిష్కరించుకునేందుకు ఐర్లాండ్‌ను గ్రూప్ మార్చాలని కోరడంపై ఆ దేశ క్రికెట్ బోర్డు భగ్గుమంది. 'పొట్టి ప్రపంచకప్ షెడ్యూల్‌పై మాకు స్పష్టమైన హామీ లభించింది. అందుకని ఐసీసీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మేము వరల్డ్‌కప్ మ్యాచ్‌లు శ్రీలంకలోనే ఆడుతాం' అని క్రికెట్ ఐర్లాండ్ కుండబద్ధలు కొట్టినట్టు చెప్పింది. దాంతో.. బంగ్లాదేశ్ బోర్డు తదుపరి ఏం నిర్ణయం తీసుకోనుంది? షెడ్యూల్‌కు కట్టుబడి కోల్‌కతా, ముంబైలోనే లీగ్ మ్యాచ్‌లు ఆడుతుందా? అనేది అందరిలోఆసక్తి రేపుతోంది.

ట్రెండ్‌లో చేరిన పెద్ది బ్యూటీ



ఇటీవల 2016 vs 2026ఫోటోల ట్రెండ్ పెద్ద చర్చగా మారింది. మృణాల్ ఠాకూర్ కొద్ది రోజుల క్రితం సోషల్ మీడియాలో ఈ ఫోటోల ట్రెండ్‌ను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. జనవరి 2026లో మృణాల్ తన ఇన్‌స్టాలో కొన్ని పాత వీడియోలు, కొత్త సెల్ఫీలను షేర్ చేస్తూ ఈ ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. 2016 నాటి తన పాత వీడియోలను వెతికితే కేవలం మూడు మాత్రమే దొరికాయని, అవి చూడటానికి ఇబ్బందిగా.. నవ్వు తెప్పించే(క్రింజ్ గా)లా ఉన్నాయని సరదాగా చెప్పుకొచ్చారు. తన గ్యాలరీలో ఉన్న కొన్ని లేటెస్ట్ సెల్ఫీలను కూడా షేర్ చేశారు.నేను ఈ ట్రెండ్‌ను ఆలస్యంగా ఫాలో అవుతున్నానా? అని మృణాల్ తన అభిమానులను అడిగారు. ధనుష్‌తో పెళ్లి వార్తలు ఒకవైపు ఊదరగొడుతున్న సమయంలో మృణాల్ అవేవీ పట్టించుకోకుండా తన పాత జ్ఞాపకాలను పర్సనల్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తున్నట్లు ఇది స్పష్టం చేసింది.
కరీనా కపూర్ తన 2016 నాటి బేబి బంప్ ఫోటోలను షేర్ చేయడంతో ఈ ట్రెండ్ అప్పట్లో బాగా వైరల్ అయింది. మృణాల్ కూడా ఆ ట్రెండ్‌లో భాగమయ్యారు. ఆ తర్వాత జాన్వీకపూర్ సోదరి ఖుషీ కపూర్ క్రింజ్ ఫోటోలను షేర్ చేయగా సోషల్ మీడియాలో డిబేట్ మొదలైంది. 16 జనవరి 2026న ఖుషీ కపూర్ ఇన్‌స్టాగ్రామ్‌లో `2026ఒక కొత్త 2016`అనే వైరల్ ట్రెండ్‌లో భాగంగా ఈ పోస్ట్ పెట్టారు. ఖుషీ కపూర్ 2016 నాటి తన పాత ఫోటోలు, వీడియోలను షేర్ చేస్తూ .. 2016 నుంచి కేవలం మూడు క్రింజ్ వీడియోలు, 2026లో అలాంటివే కొన్ని సెల్ఫీలు షేర్ చేస్తున్నానని రాసారు. ఖుషీ తన టీనేజ్ రోజుల్లో (2016లో) సరదాగా తీసుకున్న మూడు వీడియోలను షేర్ చేశారు. అవి ఇప్పుడు చూస్తే తనకు `క్రింజ్`గా అనిపిస్తున్నాయని ఖుషీ చమత్కరించారు. ప్రస్తుతం సంవత్సరం 2026లోను తను తీసుకున్న కొన్ని అందమైన సెల్ఫీలను కూడా జత చేస్తూ, ఈ ట్రెండ్‌లో పాల్గొనడానికి నేను ఆలస్యం చేశానా? అని అడిగారు.2016లో చాలా కూల్‌గా ఉండేదాన్ని అని కూడా ఖుషీ పేర్కొంది.దీనికి జాన్వీ కపూర్ `షాక్డ్` అంటూ రియాక్ట్ అయ్యారు. ఖుషీ పోస్ట్ చూసిన వెంటనే తన అక్క జాన్వీ కపూర్ చాలా సరదాగా స్పందించారు. అసలు అందరూ ఎందుకు ఈ 2016 ట్రెండ్ ఫాలో అవుతున్నారో అర్థం కాక, జాన్వీ ఇలా కామెంట్ చేశారు. అసలు అందరూ ఇది ఎందుకు చేస్తున్నారు? అని రాసారు. జాన్వీ చేసిన కామెంట్ నెటిజన్లను బాగా ఆకట్టుకుంది. అసలు ఈ 2016 ట్రెండ్ ఏంటి? అంటే వివరాల్లోకి వెళ్లాలి. జనవరి 2026 ప్రారంభంలో సోషల్ మీడియాలో `2026 ఈజ్ ది న్యూ 2016`` అనే ట్రెండ్ మొదలైంది. పదేళ్ల క్రితం (2016లో) తాము ఎలా ఉన్నామో చూపిస్తూ, అప్పటి పాత స్నాప్‌చాట్ ఫిల్టర్లు, ఫ్యాషన్ సెన్స్, ఇతర జ్ఞాపకాలను సెలబ్రిటీలు షేర్ చేస్తున్నారు. ఖుషీ కపూర్‌తో పాటు అనన్య పాండే, సోనమ్ కపూర్, అలియా భట్, కరీనా కపూర్ కూడా ఈ ట్రెండ్‌లో పాల్గొని తమ పాత ఫోటోలను షేర్ చేశారు.ఖుషీ కపూర్ తర్వాత ఇప్పుడు తన సోదరి జాన్వీ కపూర్ కూడా ఈ క్రింజ్ ఫెస్ట్‌లో పాల్గొన్నారు. ``2016 నుండి కేవలం 3 చాలా భయంకరమైన వీడియోలు మాత్రమే దొరికాయి, కాబట్టి అవైనా మిగిలి ఉన్నాయి`` అని రాసారు. కానీ 2026 సెల్ఫీలు మిస్ అయ్యాయని ఆవేదన చెందుతూ, ఈ ట్రెండ్‌లో చాలా ఆలస్యంగా జాయినయ్యానా?`` అని ప్రశ్నించారు. ప్రస్తుతం జాన్వీ షేర్ చేసిన 2016 ఫోటోలు, వీడియోలు వైరల్ గా షేర్ అవుతున్నాయి. వీటిలో ఒక వీడియో ప్రత్యేకంగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అప్పట్లో జాన్వీ చాలా శ్రద్ధగా క్లాసికల్ డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తున్నది, అలాగే టీవీలో కొరియోగ్రఫీ చూస్తూ ప్రాక్టీస్ చేస్తున్న మరో వీడియో కూడా వైరల్ గా మారుతున్నాయి. రామ్ చరణ్ సరసన జాన్వీ నటించిన `పెద్ది` మార్చి చివరిలో విడుదలకు రానున్న సందర్భంగా అభిమానులు చాలా ఉత్కంఠగా ఈ సినిమా గురించి ఎదురు చూస్తున్నారు. ఇలాంటి సమయంలో తనను తాను లైమ్ లైట్ లో ఉంచుకుంటూ జాన్వీ చేస్తున్న ఈ ప్రచారం సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

మహారాజ 2.. సీక్వెల్ చిక్కు ఒక్కటే

మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి ఒక ప్రాజెక్ట్ ఓకే చేస్తే అందులో కచ్చితంగా విషయం ఉంటుందని చాలా సినిమాలు ప్రూవ్ అయ్యాయి. వాటిల్లో మహారాజ కూడా ఒకటి. నిథిలన్ స్వామినాథన్ డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమా కమర్షియల్ గానే కాదు ఎమోషనల్ గా సూపర్ గా వర్క్ అవుట్ అయ్యింది. అసలు ఈ సినిమా స్క్రీన్ ప్లే చూసిన ఆడియన్స్ షాక్ అయ్యారు. విజయ్ సేతుపతి కథా సెలక్షన్ పై మరింత కాన్ఫిడెన్స్ వచ్చేలా చేసింది ఈ మూవీ.ఐతే ఈమధ్య ఒక సినిమా సూపర్ హిట్ అయ్యిందంటే చాలు దానికి అవసరం ఉన్నా లేకపోయినా సీక్వెల్ చేస్తున్నారు. కొన్ని సినిమాలు సీక్వెల్స్ క్లిక్ అవుతుంటే మరికొన్ని మాత్రం అసలు ఆడట్లేదు. అంతేకాదు ఒకసారి ఆల్రెడీ చూసేసిన క్యారెక్టర్స్ ని మరో కథలో చూడటం ఇబ్బందిగానే ఉంటుంది. ఒకవేళ సీక్వెల్ కథ బాగా కుదిరితే తప్ప ఇది వర్క్ అవుట్ అవ్వదు.ముఖ్యంగా ఫస్ట్ సినిమా కన్నా ఏదైనా సూపర్ హిట్ సినిమా సీక్వెల్ అంటే చాలు అంచనాలు తారాస్థాయిలో ఉంటున్నాయి. అందుకే ఈ సీక్వెల్ సినిమాల మీద ఆడియన్స్ డిఫరెంట్ ఒపీనియన్స్ తో ఉన్నారు. ఐతే మహారాజ సినిమాకు సీక్వెల్ కథ ఆల్రెడీ నిథిలన్ రాసుకున్నాడట. విజయ్ సేతుపతి కూడా లైన్ బాగుందని నెక్స్ట్ పూర్తి స్క్రిప్ట్ తో వచ్చి కలవమని చెప్పాడట.సో మహారాజ సీక్వెల్ కథ దాదాపు లాక్ అయినట్టే అనిపిస్తుంది. ప్రస్తుతం విజయ్ సేతుపతి పూరీ జగన్నాథ్ డైరెక్షన్ లో స్లమ్ డాగ్ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా పూర్తయ్యాక నిథిలన్ మూవీ ఉంటుంది. మహారాజ సీక్వెల్ సినిమా అనగానే ఆడియన్స్ లో ఒక ఆసక్తి మొదలైంది. తప్పకుండా ఈ సినిమా మరోసారి ఆడియన్స్ కి ఒక డిఫరెంట్ ఎక్స్ పీరియన్స్ అందించే ఛాన్స్ ఉంటుందని చెప్పొచ్చు.మహారాజ 2 సినిమాతో విజయ్ సేతుపతి మరోసారి తన మార్క్ చాటబోతున్నాడు. పూరీ సినిమా వెంటనే ఈ సీక్వెల్ వస్తే కెరీర్ పరంగా విజయ్ కు ప్లస్ అవుతుందని చెప్పొచ్చు. ఇక ఈమధ్య విలన్ పాత్రలను వదిలి సోలో సినిమాలకే ప్రాధాన్యత ఇస్తున్న విజయ్ సేతుపతి పూరీ సినిమాతో భారీ టార్గెట్ పెట్టుకున్నాడని తెలుస్తుంది.తమిళ ఆడియన్స్ మాత్రమే కాదు తెలుగులో విజయ్ సేతుపతికి మంచి ఫాలోయింగ్ ఉంది. ఆల్రెడీ ఇక్కడ ఉప్పెనలో శేషారాయణం పాత్రలో అదరగొట్టిన విజయ్ సేతుపతి రాబోతున్న పూరీ సినిమాతో స్ట్రైట్ తెలుగు ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేయబోతున్నాడు. ఇక మహారాజ 2 సినిమాపై కూడా ఆడియన్స్ క్రేజ్ చూస్తుంటే ఈ సీక్వెల్ కూడా విజయ్ స్టామినా ప్రూవ్ చేసేలా ఉందని చెప్పొచ్చు.

తిరుమలకు సినీ నిర్మాత బండ్ల గణేశ్ పాదయాత్ర

సినీ నిర్మాత బండ్ల గణేశ్ తిరుమలకు పాదయాత్ర చేపట్టనున్నారు. వైకాపా హయాంలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ఏపీ సీఎం చంద్రబాబు అరెస్టైన సమయంలో మొక్కుకున్న మొక్కును తీర్చుకుంటానని ఆయన తెలిపారు. ఈనెల 19న ఉదయం 9 గంటలకు షాద్‌నగర్‌లోని తన నివాసం నుంచి 'సంకల్ప యాత్ర' ప్రారంభిస్తానని బండ్ల గణేశ్ వెల్లడించారు."మన నాయకుడు, దేశం గర్వించే దార్శనికుడు చంద్రబాబుపై వేసిన అభాండాలు తొలగిపోవాలని.. జైలు నుంచి ఆయన బయటకు రావాలని సుప్రీంకోర్టు గడపపై నిలుచుని శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థించా. 'నా గడప నుంచి నీ కొండ దాకా పాదయాత్ర' చేస్తానని మొక్కుకున్నా. ప్రతి తెలుగువాడి ప్రార్థనలతో చంద్రబాబు మళ్లీ అఖండ విజయంతో పూర్వ వైభవాన్ని సాధించుకున్నారు. ఇటీవలే కేసులన్నీ కొట్టేశారు. దీంతో నా మనసు కుదుటపడింది. నా కుటుంబం మొక్కు గుర్తు తెచ్చుకుంది. అందుకే అమ్మానాన్నల ఆశీర్వాదాలతో షాద్‌నగర్‌లోని మా ఇంటి గడప ముందు కొబ్బరికాయ కొట్టి పాదయాత్ర ప్రారంభిస్తాను. ఆ శ్రీనివాసుని అనుగ్రహంతో కొండకు చేరి దర్శనం చేసుకుంటాను. ఇది రాజకీయ యాత్ర కాదు. నా మనోవేదన తీర్చిన, నా కోరిక నెరవేర్చిన, నా మాట ఆలకించిన ఆ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామికి నా మొక్కుబడి చెల్లింపు" అని బండ్ల గణేశ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

దైవ దర్శనంలో బన్నీ కుటుంబం..

బాక్సాఫీసు దగ్గర వసూళ్లతో సరికొత్త రికార్డులు సృష్టించిన 'పుష్ప: ది రూల్' ఇటీవల జపనీస్ భాషలో విడుదలైంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా హీరో అల్లు అర్జున్ హీరోయిన్ రష్మిక మందన తదితరులు జపాన్ వెళ్లారు. అక్కడ అభిమానులతో కలసి సందడి చేశారు. ఓ థియేటర్‌లో బన్నీ ప్రేక్షకుల ముందు జపనీస్‌లో డైలాగ్ చెప్పడం విశేషం. ప్రచారం అనంతరం కుటుంబంతో కలసి అల్లు అర్జున్.. టోక్యోలోని సెన్‌సోజి ఆలయాన్ని సందర్శించారు. ఆ ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు.మరోవైపు, తనపై జపనీయులు చూపిన ప్రేమకు ఎమోషనల్ అయ్యారు రష్మిక. జపాన్‌లో ఉన్నది ఒక్క రోజే అయినా వారి అభిమానం మరిచిపోలేనిదని పేర్కొన్నారు. అక్కడి అభిమానులు రాసిచ్చిన లేఖలు, కానుకలు ఇంటికి తీసుకొచ్చినట్లు తెలిపారు. మళ్లీ జపాన్ వెళ్లే సమయానికి జపనీస్ నేర్చుకుంటానని, ఎక్కువ సమయం ఉంటానని అక్కడి ఫ్యాన్స్‌కు ఆమె చెప్పారు.

ప్రతీ కథ ఓ చిన్న పరిచయంతోనే..

'సర్వం మాయ' చిత్రంతో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు మలయాళ నటుడు నివిన్ పౌలీ. గతేడాది క్రిస్మస్ సందర్భంగా విడుదలైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుని బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లని సాధించింది. నివిన్ తదుపరి చిత్రాల్లో భాగంగా 'బేబీ గర్ల్' అనే సినిమాలో నటించాడు. అరుణ్ వర్మ దర్శకత్వం వహించిన ఈ సినిమాని లిస్టిన్ స్టీఫెన్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 23న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం అధికారిక ట్రైలర్‌ను ఆవిష్కరించింది. "ప్రతీ కథ ఓ చిన్న పరిచయంతో మొదలవుతుంది.. ప్రతి కల ఒక స్ఫూర్తితో ప్రారంభమవుతుంది" అనే క్యాప్షన్‌తో సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది. "ఇది మనకు అత్యవసర పరిస్థితి.. ఇక్కడ మనం తప్ప ఎవరూ లేరు. నేను అటెండర్‌ని', 'ఇప్పుడామె ఫిర్యాదు చేస్తే మీరంతా చిక్కుకుపోతారు.. ఇది చిన్న పని కాదు" లాంటి సంభాషణలతో సాగుతున్న ఈ ట్రైలర్ ప్రేక్షకులలో ఆసక్తిని రేకెత్తించేలా ఉంది. ఒక శిశువుని కిడ్నాప్ చేసిన కథాశంతో థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించినట్లు ట్రైలర్‌తో స్పష్టమవుతుంది. ఈ సినిమాలో నివిన్ అటెండర్‌గా ప్రేక్షకులను అలరించనున్నాడు. ఈ చిత్రంలో లిజోమోల్ జోస్, సంగీత్ ప్రతాప్, అభిమన్యు తిలకన్ కీలకపాత్రలు పోషించారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200